ENTERED
ప్రజాశక్తి ఆదివారం అనుబంధం
సెప్టెంబర్ 26, 2010
Entered
తెలుగు తెరపై
కంప్యూటర్ మహేంద్రజాలం

హ్యాపీ బర్త్‌డే

(2010 సెప్టెంబర్ 26 నుంచి 2010 అక్టోబర్ 2 వరకు)

పి. ఇందు
సెప్టెంబర్30
బుజ్జి-రామచంద్రరావు
పొడి-విజయనగరం

ఎం. స్ఫూర్తి
సెప్టెంబర్
లావణ్య-శోభన్‌బాబు
రుద్రారం-కరీంనగర్

ఎన్. నిషాంత్‌సాయి
సెప్టెంబర్
పూర్ణిమ-శ్రీనివాసరావు
కొత్తకోట-శ్రీకాకుళం

డి. శశికళ
సెప్టెంబర్
అనిత-యాదయ్యగౌడ్
ఆమనగల్లు-మహబూబ్ నగర్

ఎమ్‌డి. గాయత్రి
అక్టోబర్1
లక్ష్మి-నాగరాజు
నంద్యాల- కడప

ఎన్. సాయి ప్రవీణ్
సెప్టెంబర్
రమాదేవి-లక్ష్మీరాజేష్
గుండుగొలను-ప.గో

అనన్య
సెప్టెంబర్26
బిందు-శ్రీరాంశేఖర్
మల్కాజ్‌గిరి-హైదరాబాద్

ఆహ్వానం

మీ చిన్నారులకు కూడా ఇలా పుట్టిన రోజు శుభాకాంక్షలు చెప్పాలని ఆశ పడుతున్నారా! అయితే ఆలస్యం ఎందుకండి! వెంటనే పోస్ట్ కార్డు తీసుకోండి. దాని మీద మీ బాబు- పాప పేరు , పుట్టిన తేదీ, నెల, సంవత్సరం, ఊరు , తల్లిదండ్రుల వివరాలు రాసి పోస్ట్ చేయండి. అన్నట్టు కార్డు పై కలర్ ఫొటో అతికించడం మరువకండి. అయితే మీ చిన్నారి వివరాలను 15 రోజుల ముందుగానే మాకు అందేవిధంగా పంపగలరు.

మా చిరునామా
హ్యాపీ బర్త్‌డే, ప్రజాశక్తి ప్లాట్ నెం. 21/1,
ఎం.హెచ్ భవన్
ఆజమాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా,
బాగ్‌లింగంపల్లి,
హైదరాబాద్-500 020

ENTERED

మనలో మాట

గాంధీగిరి!

అక్టోబర్ 2వ తేదీ వస్తుందంటే చాలు కొల్లాయి కట్టిన గాంధీ గుర్తొస్తాడు మన పాలకులకు. మహాత్ముడి పేరు వినగానే అహింస, సత్యాగ్రహం, మద్య నిషేధం, పరమత సహనం వంటివి మదిలో మెదులుతాయి. క్విట్ ఇండియా, విదేశీ వస్తువుల బహిష్కరణ సంఘటనలు కళ్లలో కదలాడతాయి. అంటరానితనం నేరం, సత్యమేవ జయతే, ఈశ్వర్ అల్లా తేరే నామ్ వంటి పదాలు చెవుల్లో మారుమోగుతాయి.

ఇవాళ దేశాన్ని, రాష్ట్రాన్ని ఏలుతోంది ఆయన వారసులమని చెప్పకొనే వారే. పేరు చివర ఆ రెండక్షరాలూ తగిలించుకొన్నవారే. వీరి మాటల్లోగానీ, చేతల్లోగానీ ఎక్కడా గాంధీ స్ఫూర్తి చూద్దామన్నా కానరాదు. పైగా ఆయన ఏదైతే చెప్పాడో, ఏదైతే ఆచరించి చూపించాడో దానికి విరుద్ధంగా నడుచుకొటున్నారు. దేశాన్ని కూడా అటే నడిపిస్తున్నారు. ఆ పెద్దాయన 'మద్యం వద్దురా బాబూ' అంటే ... ఆయన వారసులు గాంధీయిజం కాదు బ్రాందీయిజమే మా ఇజమంటున్నారు. ప్రజానీకాన్ని 'తాగండిరా బాబూ. తాగి తూగండి' అంటున్నారు. వారిని మత్తులో ముంచి బొక్కసాలు నింపుకొంటున్నారు. ఆయన స్వదేశీ ఉద్యమం చేస్తే నేడు ఆయన వారసులు విదేశీ జపం చేస్తున్నారు. ఆవేళ దేశీయ ఉప్పు కోసం దండి సత్యాగ్రహం చేశాడు గాంధీ. ఇవాళ ఆయన వారసులు విదేశీ కంపెనీల ఉప్పను మార్కెట్లలో నింపేశారు. మామూలు ఉప్ప కంటికి కనిపించకుండా చేశారు. నాడు మన నెత్తిమీద కూర్చుని పాలిస్తున్న విదేశీయులను 'క్విట్ ఇండియా' అంటే నేడు 'వెల్‌కమ్ టు ఇండియా' అంటున్నారు. ఏమాత్రం ఖాళీ సమయం దొరికినా రాట్నం వడుకుతూ చేనేతకు ఎనలేని ప్రాధాన్యతనిచ్చాడు గాంధీ. నేడు చేనేతను కాటికి చేర్చారు. సహాయ నిరాకరణోద్యమంలో భాగంగా విదేశీ వస్త్రాలను, వస్తువులను తగలబెట్టిన ఘనత గాంధీది. నేడు మార్కెట్లో ఏది చూసినా విదేశీ సరకే. తినేవి, తాగేవే కాదు! వస్తువులు, వాహనాలు కూడా!! నాడు పరమత సహనానికి నిలువెత్తు నిదర్శనంగా నిలబడ్డాడు గాంధీ. ఈశ్వర్ అల్లా తేరే నామ్ అన్నాడు. ఇవాళ అదే గాంధీ కనిపిస్తే ఆ ఇరువర్గాలవారూ మొహాలు తిప్పకునేట్టున్నారు. బాబ్రీమసీదులో గేట్లు ఎత్తేశారు! ఇక ఈ వారసుల అవినీతికి, ఆక్రమణలకు అంతమే లేదు. నీరు, నిప్పు, నింగి, నేల...ఇది అది అని లేకుండా సహజ వనరులన్నిటినీ పెద్దలకు, విదేశీ కంపెనీలకు దోచిపెట్టడమే ప్రధాన కర్తవ్యంగా పెట్టుకొన్నారు. ఆర్థిక మండళ్ల పేర వేలకువేల ఎకరాల భూమిని బలవంతంగా లాగేస్తున్నారు. కోట్ల రూపాయల విలువ చేసే గనులను తవ్వుకోమని వందల సంవత్సరాలపాటు వేలాది ఎకరాలను లీజుకిచ్చేస్తున్నారు. దోచుకున్నోడికి దోచుకున్నంత. బొక్కినోడికి బొక్కినంత. ప్రజల సొమ్ము ప్రయివేటు వ్యక్తులపరమౌతున్నా, పర్యావరణం పాడైపోతున్నా డోన్ట్ కేర్. నాడు గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం నేటికీ కల్లగానే మిగిలిపోయింది.పచ్చటిపొలాలతో, పైరగాలితో కళకళలాడాల్సిన పల్లెలు నేటి పాలకుల విధానాల పుణ్యమా అని బోసిపోతున్నాయి. వలసబాట పడుతున్నాయి.

ఇదండీ చేతి గుర్తు గాంధీగిరి!

★

ఈ సంచికలో....

టపా	...	2
కవిత్వమ్	...	6
రుచి	...	7
మనసంతా ఉల్లాసం	...	8
లైట్‌తీస్కో	...	11
వికాసం	...	12
నవ్వుల్ పువ్వుల్	...	13
అట్టమీది కథ	...	14
కథ	...	18
కొత్త పుస్తకాలు	...	20
బాలనేస్తాలు	...	22
మాటలకోట	...	24

ఇంకా...

స్ఫూర్తి ... 4

హత్తుకుపోయిన గీతా వాక్యాలు

సీరియల్ ... 10

వియత్నాం వీరుడు ఎన్‌గుయెన్ వాన్‌ట్రాయ్ పరిచయం

ఈ పేజ్ ... 21

నెట్‌తో ఇష్టాలు నిద్రలేమి కష్టాలు



నేత్రదానం మిన్న

ఈవారం మనలో మాట నేత్రదానం గురించి ఇచ్చారు. నిజంగానే అన్ని దానాల్లోకి కంటిదానం మంచి దానం. ప్రపంచమంతా చీకటిమయమైన వారికి చూపు ప్రసాదించడమంటే మాటలా! దీని ప్రాధాన్యతను చాలా చక్కగా వివరించారు. 'శ్వేత మనోగతం' కథ ఆలోచింపచేసింది.డబ్బే లోకంగా, డబ్బున్నవారితోనే స్నేహం చేసే శ్వేత తల్లి లాంటివారు మన చుట్టూ చాలా మంది వున్నారు. మానవ సంబంధాలకన్నా డబ్బు బంధాలకే ఎక్కువ విలువిచ్చే ఇలాంటివారికి ముందు ముందు ఎలాంటి గతులు పడతాయో! కత్తి పద్మారావుగారు మాత్రం చాలా చక్కగా ఆ అమ్మాయి మానసిక స్థితిని వివరించారు. ఇలాంటి కథలు మరిన్ని రావాలని కోరుకుంటున్నాం.

ఎం. మాధవి, విశాఖ.

నిజంగానే పరవశించిపోయాం

ఈవారం చూద్దామాలో శ్రీశైలం జలపాతాల గురించి చాలా చక్కగా ఇచ్చారు. అంతకముందు చూసినవే అయినా మళ్లీ చూడాలనిపించింది. భైరవసిల, మల్లికాతీర్థం, గుప్తమల్లికార్జునం, భీముని కొలను... ఒకటేమిటి ప్రతిదీ ప్రకృతి అందాలను కళ్ల నిండా నింపుతుంది. ఇలాంటి చోటికి వెళితే మనసంతా ప్రశాంతంగా అయిపోతుంది. రొటీన్ జీవితంలో చిరుజల్లులు కురిపిస్తుంది. ఇలాంటి టూరిస్ట్ ప్రదేశాల గురించి మరిన్ని ఇవ్వాలని కోరుకుంటున్నాం.

బి. సంతోష్, పి. కరుణ, లక్ష్మీనగర్, మెదక్.

నవలల పరిచయం ఇవ్వొచ్చుగా

పాఠకులకు మంచి పుస్తకాల గురించి, నవలల గురించి ...తెలుగులోనైనా, ఇంగ్లీషులోనైనా ఇస్తే బావుంటుంది. ఆసక్తిగా చదువుతారు. పరిశీలించగలరు.

ఎస్.వేణుగోపాల్, విజయవాడ.

వన్‌గ్రామ్ మెరుపుల్ ఆసక్తికరం

12న అట్టమీది కథగా వన్‌గ్రామ్ మెరుపుల్ చాలా ఆసక్తిదాయకంగా ఉంది. రోల్డ్‌గోల్డ్‌కతను బాక్సులో ఇవ్వడం బావుంది. వికాసం కాలమ్‌ను పెద్దలందరూ చదివి అవగాహన చేసుకోవాలనిపించింది. నవ్వుల్ పువ్వుల్ బాగానే ఉన్నా, చాలా వరకు పాత జోకులే ఉండడం గమనార్హం. కేకో కేకల కేకులు చవులూరింపచేశాయి. 5,500 సంవత్సరాలనాటి బూటుతో సహా ఉత్సుకత కలిగించే అంశాలలో తెల్సా ఆకట్టుకొంది. కవిత్వమ్ పేజీలో కవితలన్నీ హృద్యంగా ఉన్నాయి. అదిరేటి కాంబినేషన్లు ద్వారా హిట్ కాంబినేషన్ ఊసులన్నింటినీ జ్ఞప్తికి తెచ్చారు సినిమా కబుర్లలో. శ్రీశైల జలపాతాల కథాకమామీషు ద్వారా కొత్త సంగతులు మా దరి చేరాయి. యర్నాగుల సుధాకరరావుగారి క్రైమ్ కథల్ని వారంవారం చదువుతూనే ఉన్నాం. శ్వేతమనోగతం ఒక కథలా కాకుండా ఓ అమ్మాయి స్వగతంలా ఉంది. మనలోమాటగా గ్రామీణుల స్ఫూర్తితో అందరమూ నయనాల్ని దానం చేయడానికి అందరమూ ముందుకు రావాలని అభిలషిస్తూ...

నేమాన సుభాష్‌చంద్రబోస్, శ్రీకాకుళం.

దేవీప్రియ స్ఫూర్తికి అభినందనలు

స్ఫూర్తి శీర్షికలో కొత్త కిటికీలు తెరిచిన ఓల్గాసే వ్యాసం ద్వారా అనేక అంశాలు తెలియచేసిన ప్రముఖ జర్నలిస్ట్, కవి దేవీప్రియ గార్కి అభినందనలు. పేద ముస్లిం కుటుంబంలో పుట్టిన దేవీప్రియ సామాజిక అంశాలను అధ్యయనం చేయడంలో దిట్ట. ఓల్గా సే గంగ దేశవిదేశాల్లో ఆదిమకాలంలో మొదలుపెట్టి పలు దశల్లో వివిధ భూఖండాల్లో జరిగిన పరిణామాల్లోనూ సమాజ పురోగమనాన్ని కళాత్మకంగా రాహుల్ సాంకృత్యాయన్ తన రచనలో చూపించారు. తెన్నేటి సూరి రచించిన చంఘీజ్‌ఖాన్ ఎడారుల్లో పుట్టిన ఇతను మహా సామ్రాజ్యాలను గడగడలాడించిన తీరు అందరూ చదివి తెలుసుకోవలసిందే. మంచి రచనలు పరిచయం చేసిన ప్రజాశక్తికి అభినందనలు.

టి.శ్రీరామమూర్తి, గాజువాక, విశాఖ.

విదేశాల్లో గణేష్ మ్యూజియమా!

5వతేదీ స్నేహ అట్టమీది కథగా "అంతర్జాలంలో తెలుగుతోవ" అంశం ఉత్సుకత రేకెత్తించింది. 'మంచం రూపు మారెనే' చిత్రావళి బహు గమ్మత్తుగా ఉంది. వింత హోటళ్ల అంశం వేపకాయంత వెర్రి చాలా దేశాలలో ఉందనిపించేలా చేసింది. 'తెల్సా'లో అన్నీ అంశాలు ఆశ్చర్యచకితుల్ని చేశాయి. అతి పెద్ద బౌద్ధాలయం బోరోబుడోర్ విశేషాలు బావున్నాయి. గణేష్ మ్యూజియం విదేశాలలో ఉండడం చాలా విశేషమనిపించింది. సాహిల్ నవ్వుల్ పువ్వుల్లో కొత్త గిలిగింతలున్నాయనిపించింది. "సినిమా కబుర్లు" గురుశిష్యుల సంబంధాల సినీ సంగతులు అనేక వాస్తవాల్ని విశ్లేషించారు. 'వికాసం' ద్వారా చిన్నపిల్లలు స్వయంగా



ఎదిగేందుకు చిన్న, చిన్న పనుల్ని స్వతహాగా చేయడానికీ పెద్దల సహకారమూ ఉండాలన్న, స్పృహ కలిగించారు. 'మనలో మాట' నగ్నసత్యాన్ని అక్షరబద్ధం చేసింది.

ఎన్.ఎస్.సిహెచ్.బి, శ్రీకాకుళం.

ప్రాంతీయ వంటకాలు

మేం ప్రతివారం రుచిలో ఇచ్చే వంటకాలను తప్పనిసరిగా చదువుతాం. వెజ్, నాన్‌వెజ్ అన్నీ ఇస్తున్నారు. కానీ గ్రామాలలో కొన్నిప్రాంతాలకే పరిమితమైన వంటకాలను కూడా పరిచయం చేస్తే బావుంటుంది. అందరికీ వారి వారి స్థానిక రుచులు చూయించినట్టుంటుంది. ఆ ప్రయత్నం చేసి చూడండి.

సిహెచ్. విలాసిని, హైదరాబాద్.

నిజంగానే ఆశ్చర్యం

మీరు అనేక వింతలు విశేషాలను తెల్సాలో ఇస్తున్నారు. ఈవారం వేల సంవత్సరాల కిందటి బూటు గురించి చెప్పారు. చాలా ఆశ్చర్యం వేసింది. రోబో నోబి గురించి చదివాం. తమాషాగా వుంది. గుర్రం మీద కల్లు అమ్మే తాత గురించి చదివి స్ఫూర్తి పొందాం. నిజంగానే ఈ వయసులో అంత కష్టపడుతున్నాడంటే యువత ఎంతైనా నేర్చుకోవాలి.

సుధాకర్, పవన్, గుంటూరు.

★

SPEAK ENGLISH FLUENTLY

6 లక్షలమందికి పైగా నేర్చుకున్న కోర్సు.

తెలుగు తెలిస్తే చాలు...

ఎవరయినా ఇంగ్లీష్ నేర్చుకోవచ్చు

K.V.R. B.Com.,B.L., (Director)

రోజుకు ఒక గంట చాలు...

సులభ సూత్రాలతో ఇంగ్లీష్ నేర్చుకోండి

అనేక సంవత్సరాల కృషితో, విద్యార్థుల సమస్యలను దృష్టిలో పెట్టుకొని, ఈ సులభ సూత్రాలను తయారుచేశాం. ఇంగ్లీష్ నేర్చుకోవటం సులభంగా మార్చేశాం. మీకు తెలుగు తెలిస్తే చాలు... మీరు ఇంట్లో ఉంటూనే చాలా సులభంగా ఇంగ్లీష్ నేర్చుకోవచ్చు.

స్పోకెన్ ఇంగ్లీష్‌లో శిక్షణ నిర్వహిస్తున్న కె.వి.ఆర్.

☞ **ప్రక్కనవున్నకూపన్‌పంపండి లేదా ఇంకా ఈజీ:**

CHENNAI:
0-9789099589
హలో: 044-42121947

లేదా మీ అడ్రసుకు కోర్స్ మెటీరియల్ పంపమని SMS చేయండి

చెన్నై ఫోన్ నెంబరుకు చేసినా తెలుగులోనే మాట్లాడతారు. యస్.టి.డి. చార్జీలు ఇప్పుడు నామమాత్రమే కనుక మీ పూర్తి పేరు, ఇంటి నెం, ఊరి పేరు, పిన్‌కోడ్‌లను తెలియజేసి రూ.**1000/-**ల కు వి.పి.పి. ద్వారా పంపమని ఫోన్ ద్వారా తెలపండి. పోస్ట్‌మేన్‌కు రూ.**1000/-**లు చెల్లించి కోర్స్ పేకెట్ పొందగలరు.

ఈ కూపన్ పూర్తి చేసి వెంటనే పంపండి.

H.O.CHENNAI

KVR INSTITUTE™

AWARD WINNER

New No.26, Chari Street, T.Nagar, Chennai - 600 017.

నాకు కె.వి.ఆర్. ఇంగ్లీష్ కోర్స్ మరియు ఫ్రీ మెమరీ కోర్స్ ఇవన్నీ మొత్తం కలిపి వి.పి.పి.లో పంపండి. పోస్ట్‌మేన్‌కు మొత్తం రూ.1000/-లు చెల్లించి పాకెట్ తీసుకుంటాను.

Name: ....

Address: ....

.... Pin Code: ☐☐☐☐☐☐

ప్రత్యక్ష శిక్షణ కేంద్రాలు: ● **KARIMNAGAR:** D.No.2-6-286, C.V.R.N Road, Near:Inspection Bunglow. **Cell:**9392417745, 9030455603. ● **SURYAPET:** Vinayaka Degree College, Beside Canara Bank. **Cell:**9392417745, 90304 55603. ● **KHAMMAM:** Beside:Kaveri Restaurant, WyraRoad, **Cell:**94409 11478. ● **CHIRALA:** D.No.13/11/10, Polimera Road, M.M.R.Complex , **Cell:**98488 35625. ● **TANUKU:** D.No.27-8-11, Jeediguntavari Street, **Cell:**9392210039. ● **PALAKOL:** Beside: Chaitanya Hospital, Near:Telephone Exchange. **Ph:**228800, **Cell:**9247463900. ● **CHITTOOR:** M.B.R.Complex,D.I.Road, **Ph:**232502.**Cell:**98852 81530, 9052180134. ● **NANDIKOTKUR:** D.NO.16-59B,College Road,**Cell:**93904 44252,98494 92298. ● **ADONI:** D.No.21-121, 1st Road, S.K.D. Colony, Near: Montessori School, **Cell:**93916 44633, 98855 12384. ● **KURNOOL: Shop** No.C-45, RMK Plaza,OPP: Kalukura Hotel. **Cell:**99855 01587. ● **DHONE:** Opp: Raja Theatre, Kothapeta, **Cell:**93904 95239 ,99480 32431 ● **TADIPATRI:** Vaddi Variety Hall, Shop No.26, Upstairs, C.B.Road, **Cell:**93473 53709,92900 91456.

కె.వి.ఆర్ ప్రత్యక్షశిక్షణా కేంద్రం ప్రారంభించాలనుకొనే వారు **93466 54210** నెంబర్‌కి ఫోన్ చేసి సంప్రదించండి.

స్ఫూర్తి

- పొత్తూరి వెంకటేశ్వరరావు,
ప్రసిద్ధ సంపాదకులు.

హత్తుకు పోయిన గీతా వాక్యాలు

ఇంటర్ మీడియట్ రోజుల నుంచి నాకు అన్ని రకాల పుస్తకాలు చదవడం అలవాటైంది. అవి అనేక విధాల ఆసక్తి కలిగించాయి. అవగాహన పెంచాయి కూడా. అయితే నాపై అత్యధిక ప్రభావం చూపించిన పుస్తకం గురించి చెప్పాలంటే ఒకటి రెండు చెప్పడం చాలా కష్టం. ఒక్కటే చెప్పమంటే మాత్రం 'భగవద్గీత' అని చెబుతాను. అది కేవలం ఆధ్యాత్మిక లేదా భక్తి కోణం నుంచి మాత్రమే కాదు. ఈ రోజుల్లో విజయాలను గురించి ఎక్కువగా చెబుతుంటారు. పరాజయాలను, ప్రతికూలతలను తట్టుకోవడమే జీవితమని నాకనిపిస్తుంది. ఆ విధంగా జీవితం పట్ల ఒక పరిపూర్ణ దృక్పథం ఇచ్చిన మార్గదర్శిగా నేను 'భగవద్గీత'ను సదా పరిగణిస్తాను. అందులోని శ్లోకాలలో వ్యక్తి వికాసం, జీవన గమనం ఎలా వుండేది చెప్పబడిందంటే అతిశయోక్తి కాదు. అయితే ఆ ప్రభావం అర్థం కావాలంటే నా వ్యక్తిగత జీవితం గురించి కొంత చెప్పవలసి వుంటుంది.



ఈ పఠనాలన్నిటిలోనూ 'భగవద్గీత' నాపై చెరగని ముద్రవేసింది. అందులో ప్రపంచాన్ని గురించిన వాస్తవిక విశ్లేషణ కనిపించింది.. జీవితం గురించిన సంతృప్తి సంతోషం ఎక్కడుంటాయంటే మనం చూసే దృష్టి కీలకం అన్న శ్లోకం నాకెప్పుడూ గుర్తుకు వస్తుంటుంది. నీ కర్మ నీవు చేయి ఫలితం ఎలా వున్నా సరే అని చెప్పిన ప్రసిద్ధ శ్లోకం సరే సరి. కొంతమంది దీన్ని నిష్క్రియా పరత్వంగా అన్వయించడం సరైంది కాదు. కర్తవ్యం నిర్వహించాలి ఫలితం ఏదైనా సరే అన్న భావన తప్ప ఇందులో పని చేయకుండా వుండాలన్న మాట లేదు.

మాది మధ్యతరగతి కుటుంబం. అన్నవస్త్రాలు లేని పేదలం కాదు గనక మాది మధ్యతరగతి. గుంటూరు జిల్లా పొత్తూరు మా గ్రామం. 1934లో పుట్టాను. నా కన్నతండ్రి వెంకట సుబ్బయ్య కూలి కరణం. వారసత్వ కరణీకం కాదు గనక కూలి కరణం. అంటే వారసత్వ కరణం పక్షాన పని చేయడం. పనంతా మా నాన్నగారే చేసేవారు. నన్ను నా పిన తండ్రి పిన తల్లి పెంచుకున్నారు.

నాన్నగారు కరణీకంతో పాటు సొంతంగా సేద్యం కూడా చేసేవారు. సాయంత్రం వేళల పొలం నుంచి మేత మోపు నెత్తిన పెట్టుకుని వస్తుండేవారు. నా నెత్తిన నాలుగు దంట్లు పెట్టేవారు. ఇది సరదా కోసం చేసిన పని కాదు, శ్రమ పట్ల గౌరవం పెంచేందుకు అలా చేశారని పెద్దయ్యాక నాకు అర్థమైంది. మా వూళ్లో ఒక ప్రాథమిక పాఠశాల వుండేది. గాడ్ సేవ్ ద కింగ్ అని మా చేత పాడిస్తుండేవారు. నా తండ్రి పొలికట్టెతో ఇంటి ఆవరణ వూడుస్తూ నా చేత ఎవ్వని చేజనించు మొదలైన పద్యాలు వేమన సుమతి దాశరథి శతకాలు కంఠస్తం చేయిస్తుండేవారు. కూడికలు హెచ్చవేతల వరకూ లెక్కలు, అన్నో ఇన్నో పద్యాలు ఇంగ్లీషులో అక్షరాల వరకే మా వూళ్లో చదువు. ఇదే జీవితం అనుకుంటున్న దశలో నాకు పదేళ్లు రాకముందే నా కన్నతండ్రి పెంపుడు తండ్రి కూడా వెంటవెంటనే చనిపోయారు. ఆ మరణాల నుంచే నా పరాజయాల పరంపరా ప్రతికూల పరిస్థితులూ ప్రారంభమైనాయి. వూళ్లో అందరికీ మా పట్ల గౌరవం వున్నా అది పరిస్థితులను ఎదుర్కోక తప్పలేదు. ఆ రోజుల్లోనే ఒకసారి మా ఇంటి ముందు పిల్లల మధ్య కుస్తీ వంటిది పెట్టారు. నేను బెరుకువల్లనూ అలవాటు లేకపోవడం వల్లనూ మెల్లగా గుద్దాను. కాని అవతలి వాడి వంతు వచ్చేసరికి బలంగా గుద్దడంతో నేల కరుచుకున్నాను. పప్పన్నం తినేవాణ్ని గనక నేనేం గుద్దుతానని పెద్దలు పరాచికం చేయడంతో చాలా ఏడుపొచ్చింది(ఈ కారణంగా తర్వాతి కాలంలో నేను తాలింఖానాలో చేరి తర్ఫీదు పొందాను). తర్వాత నా చదువు కోసం మా కుటుంబం గుంటూరు చేరింది. ఎవరో ట్యూషన్ మాష్టర్ సలహా మేరకు నన్ను థర్డ్ ఫారంలో చేర్పించారు. సెకండ్ ఫారం ఎలాగో పాసు చేయించి పంపారు. అయితే తగిన పునాది లేకపోవడం వల్ల టీచర్లు ఏమైనా ప్రశ్నలు అడిగితే చెప్పలేక పోయేవాణ్ని. అందరూ నవ్వేవారు. చివరకు పరీక్ష కూడా తప్పాను. ఆ సమయంలోనే మా బావ ఒకాయన లంచాలు తగవనే ఆదర్శవాదంతో ప్రభుత్వ వుద్యోగం మానుకుని దళిత వాడలలో సేవ చేయడం మొదలుపెట్టాడు. అయితే గాంధేయ వాదులలోనూ కొందరు ఆడంబరాలు అమలు చేయడం సహించలేక అక్కడా తగవు పడి మానేశాడు. వినయాశ్రమంలోనూ పనిచేశాడు. నేను ఆ ప్రభావానికి కొంత గురైనాను. ఇంగ్లీషులో ఆయన మంచి కవితలు అల్లేవాడు. జీవితం సాధ్యం కాదు, మరణించడానికి అనుమతి లేదు అంటూ ఆయన రాసిన కవితా చరణాలు నాకు బాగా గుర్తుండిపోయాయి. చివరకు ఆయన అవినీతి లేని సమాజంలో పుట్టడం కోసం మరణిస్తున్నాను అని రాసిపెట్టి ఆత్మహత్య చేసుకున్నాడు.

ఇన్ని పరాజయాలు, ప్రతికూలాంశాల నేపథ్యంలోనే ఇంటర్ తర్వాత పుస్తకాల పఠనం బాగా అలవాటైంది. మా ప్రిన్సిపాల్ వల్లభ జోస్యుల సుబ్బారావు ఇంగ్లీషు బోధించడమే గాక

మంచి మార్కులు తెచ్చుకునే పిల్లలను సివిల్స్‌కు వెళ్లమని ప్రోత్సహించేవారు. అప్పుడే విజ్ఞానం పెంచే పుస్తకాలు చదువుకోవడం మొదలెట్టాను.జీవితంలో అవగాహన పెంచుకోవడానికే గాక అండగా నిలవడానికి కూడా పుస్తకాలు నేస్తాలవంటివని అర్థమైంది. మా అన్నగారి ప్రోద్బలంతో పత్రికలు చదవడం నేర్చుకున్నాను. ముఖ్యంగా ఇంగ్లీషులో సంపాదకీయం చదివి అర్థం కాని పదాలకు అర్థాలు రాసుకునేవాడిని. కొన్ని వాక్యాలు కంఠస్థం కూడా చేసేవాడిని. అంతో ఇంతో ఇంగ్లీషు భాషా పరిజ్ఞానం కలగడానికి ఈ పద్ధతి తోడ్పడింది. అలాగే నార్ల వెంకటేశ్వరరావు సంపాదకీయాలు శ్రద్ధగా చదివేవాడిని. కళాశాలలో సాహిత్యంలో దిట్టలైన వారు కొందరు స్నేహితులుగా వుండేవారు.

ఇక నన్ను ప్రభావితం చేసిన పుస్తకాల విషయానికి వస్తే మొదట్లో నేను కవితలు కథల కన్నా తత్వశాస్త్ర గ్రంథాలతో ఎక్కువగా ఆకర్షితుడైనాను. విచిత్రంగా మొదట పాశ్చాత్య తత్వశాస్త్ర పుస్తకాలు చదివాను. బెర్ట్రండ్ రస్సెల్ రాసిన 'హిస్టరీ ఆఫ్ వెస్ట్రన్ ఫిలాసఫీ' తర్వాతనే సర్వేపల్లి రాధాకృష్ణన్ 'హిస్టరీ ఆఫ్ ఇండియన్ ఫిలాసఫీ' చదివాను.ఈ విధంగా చేయడం వల్ల నాకు రెండింటినీ అర్థం చేసుకోవడానికి మాత్రమే గాక సమన్వయం చేసుకోవడానికి కూడా అవకాశం లభించింది. అప్పుడే కారల్ మార్క్స్ దాస్ కాపిటల్ చదివాను. అర్థం చేసుకోవడానికి చాలా ప్రయత్నించాను గాని నా వల్ల కాలేదు. ఇప్పటికైనా అంతే. నా మిత్రుడు స్వర్గీయ సింహం మాత్రం దాస్ కాపిటల్‌పై సాధికారిక అవగాహన కలిగివుండేవాడు. అంత పట్టు నేను మరికొందరిలో చూడలేదు. దాస్ కాపిటల్ అర్థం కాకున్నా మార్క్స్‌ను వదలిపెట్టలేదు. అప్పట్లో సోవియట్ యూనియన్ ప్రచురించిన 'ఫండమెంటల్స్ ఆఫ్ మార్క్సిజం లెనినిజం' అనే పుస్తకం శ్రద్ధగా చదివి అర్థం చేసుకున్నాను. ఇది కొంత మెరుగ్గానే బోధపడింది.

పుస్తక పఠనంలో మునిగిపోయాక రాజకీయాలు తత్వశాస్త్రంతో పాటు కథలు నవలలు కవిత్వం వగైరాలు కూడా చాలానే చదివాను. ఎమిలా జోలా, థామస్ హార్డీ, దోస్తోవస్కీ వంటి పాశ్చాత్య రచయితల ప్రామాణిక రచనలు చదివాను.తెలుగులో సంచలనం సృష్టించిన చలం సాహిత్యం, ఆలోచనాత్మకమైన కొడవటిగంటి కుటుంబరావు నవలలు వంటివన్నీ ఆసక్తిగా పూర్తి చేశాను. హిగిన్ బాదమ్స్‌కు వెళ్లి బ్రిటన్ నుంచి వచ్చే సైకాలజిస్ట్ పత్రికను, మన దేశంలో ప్రచురితమయ్యే ఇలస్ట్రేటెడ్ వీక్లీ చదువుతుండేవాడిని. హేతువాదం పట్ల రాడికల్ హ్యూమనిజం పట్ల ఇష్టం వుండేది.దైవం పట్లగాని సాంప్రదాయాల పట్ల గాని విశ్వాసం వుండేది కాదు. వివిధ పుస్తకాలు చదవడం వల్ల ఆత్మన్యూనతా భావం పోయి నాతో చదువుకుంటున్న విద్యార్థులకు నేను ఇంగ్లీషులో పాఠం చెప్పగల స్థాయికి చేరాను.

ఈ పఠనాలన్నిటిలోనూ 'భగవద్గీత' నాపై చెరగని ముద్రవేసింది. అందులో ప్రపంచాన్ని గురించిన వాస్తవిక విశ్లేషణ కనిపించింది.. జీవితం గురించిన సంతృప్తి సంతోషం ఎక్కడుంటాయంటే మనం చూసే దృష్టి కీలకం అన్న శ్లోకం నాకెప్పుడూ గుర్తుకు వస్తుంటుంది. నీ కర్మ నీవు చేయి ఫలితం ఎలా వున్నా సరే అని చెప్పిన ప్రసిద్ధ శ్లోకం సరే సరి. కొంతమంది దీన్ని నిష్క్రియా పరత్వంగా అన్వయించడం సరైంది కాదు. కర్తవ్యం నిర్వహించాలి ఫలితం ఏదైనా సరే అన్న భావన తప్ప ఇందులో పని చేయకుండా వుండాలన్న మాట లేదు.

యఃసర్వత్రానభిస్నేహః -తత్తత్ శుభాశుభమ్॥
నాభినందతి న ద్వేష్టి -తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా॥

దేని పట్ల ప్రత్యేకాసక్తులు లేనివాడు, అనుకూల పరిస్థితులయందు హర్షము, ప్రతికూల పరిస్థితులయందు ద్వేషము మొదలైన వికారాలకు లోనుగాని వ్యక్తిని స్థితప్రజ్ఞుడు అంటారు.

గత సంగస్య ముక్తస -జ్ఞానావస్థిత చేతసః
యజ్ఞాయాచరతఃకర్మ -సమగ్రం ప్రవిలీయతే॥

బంధాలలో చిక్కుకోకుండా విముక్తుడైనవాడు, ప్రపంచం కోసమే కర్మలు ఆచరించేవాడు, జ్ఞానమునందే నిరంతరము మనస్సును లగ్నమొనర్చినవాడు -అలాంటి మనుష్యుని కర్మలన్నియు పూర్తిగా సార్థకమౌతాయి.

తర్వాతి కాలంలో కొన్ని ఉద్యోగాలు చేసినా చివరకు నాకు ఇష్టమైన జర్నలిజంలో స్థిరపడ్డాను. వివిధ పత్రికల్లో సంపాదకుడిగా పనిచేశాను. అవన్నీ ఇక్కడ చెప్పబోవడం లేదు గాని పుస్తకాలతో ముడిపడిన సంగతులు ప్రస్తావిస్తాను.ప్రెస్ అకాడమీ చైర్మన్ బాధ్యతలు నిర్వహించినపుడు పాత పత్రికల డిజిటైజేషన్ చేపట్టాము. తెలుగు నాట వివిధ గ్రంథాలయాలలో వున్న పాత పత్రికలన్నిటినీ సీడీల రూపంలో ఎంఒడీల రూపంలో నిక్షిప్తం చేశాము. ఆ విధంగా నా అధ్యయనానికి తోడ్పడిన పత్రికా ప్రపంచం శిథిలమై పోకుండా భావి తరాల వారికోసం భద్రపరిచానన్న తృప్తి కలిగింది. పత్రికా రంగంలో పని చేస్తున్నందున అధ్యయనం అవసరం ఎక్కువ గనక పుస్తకాలు చదివేప్పుడు నోట్సు తీసుకునే వాడిని. అలా అనేక విధాల విలువైన సమాచారం పోగుపడింది. ఢిల్లీలోని నెహ్రూ మెమోరియల్ లైబ్రరీ మొదలు మన రాష్ట్రంలోని కొన్ని ముఖ్యమైన గ్రంథాలయాలలో రోజుల తరబడి పుస్తకాలను చదివే అవకాశం నాకు కలిగింది. నా సాహిత్య వ్యాసాలు కావ్యానుశీలన, పరిశీలనా వ్యాసాలు రాయడం ద్వారా నా అనుభూతులను పంచుకోగలిగాను. ఉద్యోగ విరమణ తర్వాత కొన్ని పుస్తకాలు రాయడానికి ప్రణాళిక సిద్ధం చేసుకున్నాను. తెలుగు పత్రికల చరిత్రపై రాసిన దాదాపు 700 పేజీల పుస్తకం ప్రెస్ అకాడమీ ప్రచురించింది. ఇక నాటి పత్రికలు మేటి విలువల అన్న పుస్తకంలో మరుగుపడిన అనేక సాహిత్య పత్రికల చరిత్రను తెలియజేశాను. వాటిలో రాసిన మహా రచయితల సంపాదకుల తాలూకా విశేషాలు రచనల వివరాలు పొందుపర్చాను. ఆధునిక తెలుగు పత్రికల ఆదిపురుషుడి వంటి కాశీనాథుని నాగేశ్వరరావు జీవిత చరిత్ర కేంద్ర సాహిత్య అకాడమీ కోసం రాశాను. వీటన్నిటికీ ప్రేరణ ప్రాతిపదిక అధ్యయనంలో సేకరించిన సమాచారమే. కనకనే నాకు పుస్తకాల పట్ల ఎప్పుడూ గొప్ప గౌరవం. నిజంగానే అవి నాకు హితులు, స్నేహితులు, మార్గదర్శకులు. ★

అప్పుడే కారల్ మార్క్స్ దాస్ కాపిటల్ చదివాను. అర్థం చేసుకోవడానికి చాలా ప్రయత్నించాను గాని నా వల్ల కాలేదు. ఇప్పటికైనా అంతే. నా మిత్రుడు స్వర్గీయ సింహం మాత్రం దాస్ కాపిటల్‌పై సాధికారిక అవగాహన కలిగివుండేవాడు. అంత పట్టు నేను మరికొందరిలో చూడలేదు. దాస్ కాపిటల్ అర్థం కాకున్నా మార్క్స్‌ను వదలిపెట్టలేదు. అప్పట్లో సోవియట్ యూనియన్ ప్రచురించిన 'ఫండమెంటల్స్ ఆఫ్ మార్క్సిజం లెనినిజం' అనే పుస్తకం శ్రద్ధగా చదివి అర్థం చేసుకున్నాను. ఇది కొంత మెరుగ్గానే బోధపడింది.



కవిత్వమ్

విశిష్టజీవులు

వేల భూములు చేతపట్టి
జనం చాకిరి దోచినట్టి
కాయకష్టం చేయువారల
కడుపుకొట్టి బలిసినట్టి

కాయకష్టం కోలుపోయి
ఒట్టిపోయిన వడలిపోయిన
డొక్కలెండిన వారిజూచి
కపట కన్నీరిడుచునట్టి

కుటిల బుద్ధుల మాయగాళ్ళను
పేదవారికి పెన్నిధులుగా
చేతులెత్తి మొక్కుచున్న
మనుజులారా మేలుకోండి

కాదు కాదు కాదు కాదు
వారు కాదు విశిష్ట జీవులు

ఎవడు పుడమికి పండనేర్పగ
హలము బలపం పట్టెనో
ఎవడు చక్రభ్రమణ విధమును
మదిని మొదటిగ తలచెనో

హోరుమని కూపెట్టి అరచే
యంత్రములు కదలింప ఎవ్వని
కండరమ్ములు బిగిసెనో

నువువసించెడి చలువహర్మ్యపు
తాపడమునకు మెరుపు తేవగ
ఎవని పనితనమద్దెనో

నడుము వంచి గనుల నుంచీ
వనరు నెవ్వరు తీసెనో
ఎవరి స్పర్శతో వస్తుసంపద
రూపునొంది పోగుపడెనో

భావవాదుల కర్మవాదం
పుక్కిపట్టిన సోమరుల్
ఈ జగతి ప్రగతిని
అడిగినప్పుడు
శ్రమను అవమానించినప్పుడు
చలనసూత్రపు కొలిమికాలిచి
ఎవరు సత్తువ చూపెనో

పురిటి బిడ్డకు పాలుపట్టి
నడుము జోలిన నిద్రపుచ్చి
అడవిచెలగగ నేలదున్నగ
పలుగునాగలి కత్తికొడవలి
చేతనెవ్వతె పట్టెనో

ఎవతెఘర్మం అవనిపైపడి
పైరుగంధం అయ్యెనో
ఎవనికాయం కర్మబాటలో
వస్తుసృజనలో కమిలెనో

వారు కాక విశిష్టజీవులు
లేరు లేరు లేరు లేరు
లేరు మినహా జగతినెవ్వరు

ఒళ్ళు వంచెడి మహామనుషులు
చెమట కార్చెడి కర్మయోగులు
వారెమనకు విశిష్ట జీవులు
తెలుసుకోండీ తెలుసుకోండీ
మనుజులారా మేలుకొండి.

- తాండ్ర రమణ

'శిక్షణ'



సరస్వతీ నమస్తుభ్యం... గురుబ్రహ్మ గురువిష్ణు
ఒకనాటి ప్రార్థనలు.
విజ్ఞాన, చైతన్య, నారాయణ..
నేటి విద్యార్థినీ విద్యార్థుల భాష్యాలు
ఉదయాన్నే ట్యూషన్లు
మధ్యాహ్నానికి స్పెషల్ క్లాసులు
సాయంత్రానికి స్టడీ అవర్లు
రాత్రికెటూ ఉంటాయి... హోంవర్క్‌లు
ఇంకా సమయం మిగిలిందా..!
ఉన్నాయిగా కంప్యూటర్ కోర్సులు
ఎల్.కె.జి. యు.కె.జి వారి చదువులు
వారిపై ఎందుకిన్ని కేజీల బరువులు
పూర్తిగా లోకాన్ని కూడా చూడని వారి కళ్ళు
కనిపించాలంటే కావాలి కళ్ళజోళ్ళు
స్వేచ్ఛగా పరిగెట్టలేవు వారి కాళ్ళు
బంధింపబడుతున్నాయి వారి భావాలు
స్కూళ్ళు కావవి... సెల్యులార్ జైళ్ళు
యూనిఫాంలో ఉన్న బాల కార్మికులు వీళ్ళు
కార్పొరేట్ విద్యపై మోజు
వేలల్లో కడుతున్నారు ఫీజు
స్కూల్ బస్సూ.. సిబియస్సీ సిలబస్సు
ఎంసెట్ కోచింగ్... ఐఐటి టీచింగ్
నాయనమ్మల పేదరాశి పెద్దమ్మ కథలకి
తాతయ్యల తియ్యని కబుర్లకి
తల్లిదండ్రుల ప్రేమానురాగాలకి వారు ఎంతో దూరం
విచ్చుకోవాల్సిన లేలేత మొగ్గలు
విచ్ఛిన్నమై వాడిపోతున్నాయి
అందరికీ విద్య....
ఎందరికుంది బాధ్యత...!

- వేద

కిస్‌మిస్ లెమన్ పూరీ

కావాల్సిన పదార్థాలు

కిస్‌మిస్- 100 గ్రాములు, నిమ్మకాయలు- 2, మైదా- పావుకిలో, పంచదార- పావుకిలో, ఉప్పు- అరచెంచా, వెన్న-100 గ్రాములు నెయ్యి- పావుకిలో, మిఠాయిరంగు- కొంచెం



చేసే పద్ధతి

కిస్‌మిస్ కొద్దిపాటి నెయ్యిలో వేయించి వుంచుకోవాలి. మైదాపిండి శుభ్రంగా జల్లించి అందులో నీళ్ళు, ఉప్పు, వెన్న కలిపి మెత్తగా ముద్దగా తయారుచేసుకోవాలి.

అప్పడాల పీటమీద పూరీల్లాగా తయారుచెయ్యాలి. రెండేసి పూరీలు కలిపి మధ్యలో కిస్‌మిస్ వుంచి వొత్తితే పూరీ బాగా వొత్తుగా వస్తుంది. పంచదార, నీళ్ళు కలిపి ఒక పాత్రలో పాకం తయారు చేసుకోవాలి. ఈ పాకం మరీ ముదురుపాకం కాకూడదు. తీగపాకమైతేచాలు.

ఈ పాకం తయారయ్యాక కిందికి దింపి అందులో నిమ్మకాయల రసం పొయ్యాలి. తర్వాత మిఠాయిరంగు వేసి కలబెట్టాలి. మూకుడులో నెయ్యి పోసి పూరీలను దోరగా వేయించి ఈ పాకంలో మునిగేటట్టు చెయ్యాలి. పూరీలు పాకాన్ని పీల్చి బాగా వురతాయి. చల్లారితే తినడానికి బాగుంటుంది. పాకం గట్టిపడితే పూరీలు బిగుస్తాయి. పలచగా వుంటే పాకం ఓడుతూ వుంటాయి. ఎలా యిష్టమయితే అలా చేసుకోవచ్చు.

పోలీ

కావాల్సిన పదార్థాలు

శనగపప్పు- 1 కప్పు, బెల్లం- 100 గ్రాములు, నువ్వుల నూనె- 2 టేబుల్ స్పూన్లు, లవంగాలు- 3, యాలకులు-3, మైదాపిండి- అర కప్పు

చేసే పద్ధతి

శనగపప్పు రాళ్ళు లేకుండా బాగుచేసి నీళ్ళు కలిపి ఒక పాత్రలో వుడికించాలి. మెత్తగా వుడికిన తర్వాత పప్పును తీసి వడబొయ్యాలి. వడబొయ్యగా మిగిలిన నీళ్ళలో బెల్లం కలిపి బాగా పాకం పట్టాలి. వుడికించిన శనగపప్పు మెత్తగా రుబ్బాలి. అందులోనే యాలకులపొడి, లవంగాల పొడికూడా వెయ్యవచ్చు.

ఈ పిండి ముద్దని బెల్లం పాకంలో కలిపి వుంచుకోవాలి. ఇది వరకే నానబెట్టుకున్న మైదాపిండిని చిన్న చిన్న గోలీలుగా చేసి అప్పడాలపీట సాయంతో పూరీలుగా చెయ్యాలి.

ఈ పూరీ మధ్య శనగపూర్ణం పెట్టి పూరీ మధ్యకి మడవాలి. అర్ధచంద్రాకారంగా తయారవుతుంది. గుండ్రంగా వున్నవైపు అతుక్కునేటట్టు చెయ్యాలి. పెనంమీద నెయ్యిరాసి దానిమీద దోరగా వేయిస్తే పోలీ తయావుతుంది.

జున్ను

కావాల్సిన పదార్థాలు

పాలు-లీటరు, పంచదార- అరకిలో జున్ను గడ్డి- 10 గ్రాములు



చేసే పద్ధతి

జున్ను గడ్డి శుభ్రంగా కడిగి నానబెట్టాలి. ఒక పాత్రలో పాలు పోసి దానికి నాలుగోవంతు నీళ్ళు కలపాలి. తక్కువ మంటతో నెమ్మదిగా కాయాలి. గరిటతో తిప్పుతుంటే అడుగంటదు. పొంగదు. నీళ్ళు అనిరై పోయి పాలు మిగిలేదాకా ఇలా మరగబెట్టాలి.

మరగబెట్టిన పాలల్లో జున్ను గడ్డి వేయాలి. కొద్దిసేపయ్యాక (సుమారు పావుగంట) పంచదార వేసి కలపాలి. పది నిమిషాల్లో బాగా వుడుకుతుంది (చెంచాతో తీసి ప్లేటులోవేస్తే కాస్సేపటిలోనే గడ్డ కడుతుంది)ఇలా వచ్చాక దింపి గాలివాటున వుంచితే చల్లారుతుంది.

పై పదార్థాన్ని ఒక పళ్ళెం తీసుకుని శుభ్రంగా తుడిచి అందులోపోసి అరబెట్టుకోవాలి. అప్పుడు పలచగా పళ్ళెం ఆకారంలో బిగుస్తుంది. ఇలా కూడా చేసుకోవచ్చు. తర్వాత చాకుతో కోస్తే ముక్కలు ముక్కలుగా తెగుతుంది.

ముర్రిపాలు ఉపయోగించినప్పుడు జున్నుగడ్డి అవసరం వుండదు.

మనసంతా ఉల్లాసం



రోజులు రొటీన్‌గా నడిచిపోతున్నాయి. పనిలో ఉత్సాహం కొరవడింది. అంటే రీచార్జ్ కావాల్సిన అవసరం ఎంతైనా వుందన్నమాట! మరి దానికి ఒక మార్గం భవబంధాలను ఛేదించుకుని ఎక్కడికైనా రెక్కలు కట్టుకుని ఎగిరిపోవడమే! అందుకు 'దసరా' కదా సరైన సమయం. దానికింకా టైముంది. అవునూ! ఎక్కడికో వెళ్లేకన్నా దగ్గరలోని ఏదైనా ప్రాంతానికెళ్లి ఎనర్జీని మూటగట్టుకోవచ్చుగా అనిపించింది. ఇకనేం! రెడీ టూ రీచార్జ్!

నిజానికి ఎక్కడికో వెళ్లాలని తెగ ఉబలాటపడతాం కానీ పక్కనే వున్న ఎన్నో అమూల్య ప్రాంతాలను పట్టించుకోం. 'పెరటి చెట్టు వైద్యానికి పనికిరాదని' తెలుసుగా! కాకపోతే వర్షం సినిమా చూసినప్పటి నుంచీ 'వరంగల్' చూసెయ్యాలని, కాలం కలిసొస్తే ఆ గుడికెళ్లినపుడు వానొస్తే అందులో తడిసిపోవాలని తెగ ఆరాటపడిన మాట వాస్తవం. మరెందుకు ఆలస్యం, వరంగల్‌కే వెళ్లొచ్చేద్దామని మేము, మా ఆడబడుచు పద్మ కుటుంబం అనుకున్నాం. అత్తయ్య వాళ్లకు ఫోన్‌చేసి వెంటనే వచ్చేయమన్నాం.

ఆ మర్నాడు అంతా కలిసి బయలుదేరి రైల్వేస్టేషన్‌కు చేరాం. అక్కడే కొట్టింది దెబ్బ! వరుసగా సెలవులు రావడంతో ప్రపంచంలోని జనాలంతా రైల్వేస్టేషన్‌లోనే కొలువు తీరిపోయారు. నేల ఈనిందన్న సామెత సరిగ్గా సరిపోతుందేమో! చదువులు, ఉద్యోగం కోసం కన్నవారిని వదిలి దూరతీరాలకు వచ్చినవారే వారంతా! అమ్మ ఒడిలో వాలాలనే తాపత్రయం వారి కళ్లలో కనిపించింది. సరే, ప్రస్తుతం మనకు సీట్ దొరికే ఆశ లేనే లేదు. కనీసం నిల్చునే అవకాశముంటుందా అనుకుంటూ రైలెక్కాం. అనుకున్నట్లే కాలు తీసి కాలుపెట్టే ఛాన్సే లేదు. దాంతో అందరం నిల్చునే రెండున్నర గంటలు ప్రయాణంచేశాం. జాలీగా వెళ్తున్నాం కనుక మాకు నిరాశ కలగలేదు. కాలినొప్పులు మరిచిపోవడానికి జోకులు, సరదాలు వుండనే వున్నాయి. మొత్తానికి వరంగల్ చేరి స్నేహితుల ఇంట్లో సేదతీరాం.

మర్నాడు మా ప్రయాణం మొదలైంది. మాకు మరో కుటుంబం తోడైంది. ముందుగా రామప్ప గుడికి బయలుదేరాం. దారంతా వానల కారణంగా పచ్చగా కళకళలాడుతున్న ప్రకృతి తనలోకి రారమ్మంటూ ఆహ్వానిస్తుంటే ఆస్వాదనలో మునిగిపోయాం. దానికి తోడు మంచి అభిరుచి వున్న డ్రైవర్ ఆపాత మధురాల సీడీ పెట్టాడు. వింటూ ప్రపంచపు అంచులదాకా వెళ్లిపోయాం. అల్లంత దూరంనుంచే రామప్ప గుడి కనిపించింది. ఆ గుడి నిజంగా ఓ అద్భుతం. నాలుగు దేవాలయాల సముదాయమది! కాలుష్యానికీ, జనవాసానికి దూరంగా సేద తీరుతున్న మునుల్లా కొలువున్నాయవి! ఆ సౌందర్యాన్ని కళ్లలో నింపుకునేవారు, ఫోటోల్లో బంధించేవారూ, వివరాలు తెలుసుకునేవారూ... ఓ అరగంట అందరం బిజీ! ఈ గుళ్లు కర్నాటకలోని బేలూరు, హలిబీడు గుడులను పోలి వున్నాయి. అక్కడి శిల్పాలను చెక్కిన అమరశిల్పి జక్కనే వీటినీ నిర్మించాడని మామయ్య ద్వారా తెలిసింది. అందుకే ఆ నిర్మాణ శైలి కన్పించిందన్నమాట! సాలభంజికలు, నాట్య భంగిమలు, నందులు భలేగా వున్నాయి. ఒక మండపంలో శిలాశాసనం గత చరిత్ర తనలో దాగుందని మహా ఠీవీగా చెపుతోంది. కానీ అవన్నీ చాలా వరకూ శిథిలమైపోతున్నాయి. ఆ నాలుగింటిలో ఒక గుడి లోపలికి దిగబడిపోయింది. నాకు ఒక్కటే అర్థంకాదు. పక్క రాష్ట్రాలు, దేశాలు తమ చరిత్రను తెలిపే నిర్మాణాలను ఎంతో పదిలంగా కాపాడుకుంటారు. కానీ మనలో ఆ ముందుచూపు కొరవడుతుందెందుకో!

తరువాత రామప్ప చెరువు వైపుకు మళ్లాం. అదో పెద్ద చెరువు. ఆ చెరువు కొన్ని వేల ఎకరాలకు నీటిని అందజేస్తుందట. బాగా కురుస్తున్న వర్షాల కారణంగా నిండుగా వుంది. పిల్లగాలి తెమ్మెరలు, అల్లనల్లన కదలాడుతున్న చెట్లు అదో మైమరపుకు గురిచేశాయి. అక్కడ బోటింగ్ వుంది. సో, మరుక్షణంలో మేమంతా ఒక బోట్‌లో వున్నాం. చుట్టూ వున్న కొండలు, ఎగిరే పక్షులు, పచ్చని ప్రకృతి సాయంతో విహారం సాగించాం.

సరే, అంతా బానే వుందనుకుంటూ ఒడ్డుకొచ్చామా వెహికల్ లేదు. ఏంటీ అని ఆరాతీస్తే మాకోసం లంచ్ తీసుకురావడానికి వెళ్లిందట. 'అయితే ఓకే' అనుకుంటూ గుట్టమీదున్న పాడుబడిన గుళ్లోకెళ్లి కిందున్న పొలాలు చూశాం. మేస్తున్న పశువులను చూశాం. నాట్లేస్తున్న రమణులను చూశాం. అప్పటికే తింటున్న యాత్రిక బృందాన్ని, కోతిచేష్టలతో వారిని విసిగిస్తున్న కోతుల్ని చూశాం. వంటసామాగ్రి, సరుకులు, పొట్లేలును తీసుకెళ్తున్న గుంపులు చూశాం. ఎంతకీ వెహికల్ రాదే! పైగా వీరందరినీ చూస్తుంటే సహజంగా ఏమనిపిస్తుంది చెప్పండి! మీ అంచనా కరెక్టే! అందరికీ ఆకలి యమ దంచేస్తోంది. మాకు చక్కని అతిథి మర్యాదలు అందించాలని ఆ కుటుంబం ఆరాటం. దాంతో మాకు చెప్పకుండా ఎవరికో చెప్పి 'స్పెషల్'గా వండిస్తున్నారట. అక్కడ ఆలస్యం అయ్యిందట. ఇక వారినీ ఏమనలేం! పాటలు, అంత్యాక్షరిలు, జోకులు అయిపోయాయి. చాకొలెట్లు, బిస్కట్లు, చిప్స్ అయిపోయాయి. ఎంతకీ వాహన వీక్షణం కాదే! ఇక అందరిలోనూ అదో రకం విరక్తి మొదలైంది. మేమంతా కలిసికట్టుగా వైరాగ్యం పొందే తరుణంలో

'అదుగో... అల్లదుగో...' అంటూ పిల్లల కేరింతలు. ఆ క్షణంలో అందరి మొహాలు చూసి తీరాల్సిందే కానీ వర్ణించతరం కాదంటే నమ్మండి! గిన్నెల్లోవన్నీ నోరూరించే వంటకాలే! ఇక ఆవురావురుమంటూ క్షణాల్లో గిన్నెలు ఖాళీచేశాం.

తరువాత లక్నవరం చెరువుకు పయనం. పెద్ద పెద్ద చెట్లు దట్టంగా కమ్ముకోవడంతో దారంతా నీడే! చల్లగా, ఆహ్లాదంగా వున్న వాతావరణాన్ని ఎంజాయ్‌చేస్తూ లక్నవరం చేరుకున్నాం. ఆ దారంతా వంటకు సన్నాహాలు చేసుకుంటూ అనేక సమూహాలు కనిపించాయి. అందరూ రావడం, అక్కడే వండుకుని తినడం తెలంగాణాలోనే ఎక్కువ చూస్తాం. వారి సందడి చూస్తుంటే భలే ముచ్చటగా అనిపించింది. నిజానికి ఇది మంచి కాన్సెప్ట్ కదా?! అంతకంతకూ తరిగిపోతున్న మానవ విలువలకు ఇదే సరైన మందు! ఇలాంటివి మెచ్చదగ్గవే కాదు, ఆచరించదగ్గవి కూడా!

ఇక లక్నవరం చెరువు దూరంగా కనిపిస్తుంటే ఉత్సాహం ఉరకలేసింది. పెద్ద చెరువు, మధ్యలో పచ్చదనం నింపుకున్న దీవులు... ఆహా ఆ అందం వర్ణనాతీతం. కేరళలోని పెరియార్ చెరువు, భద్రాచలం సమీపానున్న కిన్నెరసాని ఒక్కసారిగా కళ్లముందు కదలాడాయి. ఇక్కడా అదే అందం, అదే ఆకర్షణ. అక్కడి గాలికి ఊగులాడే కొమ్మలకు మల్లే మా మనసూ ఊయలూగింది. అక్కడ ఊగులాడే వంతెన వుంది. దానిపై నడవడం ఓ తమాషా అనుభవం. అప్పుడెప్పుడో కర్నాటకలోని నిసర్గధామంలో తరువాత మళ్లీ ఇక్కడ నడిచాం. అన్నట్లు మరిచాను. ఆ వంతెన దీవికన్నా ముందే ఆగిపోతుంది. అంటే మనం కొద్ది దూరం నీటిలో నడుచుకుంటూ వెళ్లాలి. అది ఏ ఉద్దేశ్యంతో చేసిన ఏర్పాటో కానీ, బ్రహ్మాండంగా వుంది. ఒకరినొకరు పట్టుకుని, భయపడుతూ యేరు దాటడం అందరికీ నచ్చేసింది. పిల్లలైతే అక్కడే వుంటామని ఒకటే గోల! ఇక అక్కడ ఫోటోలు వరదలా వెల్లువెత్తాయని వేరే చెప్పాలా?! మేమంతా ఆ దీవిలో ప్రశాంతంగా కూర్చుని ప్రకృతి అందాలను హృదయాల్లో బందీచేశాం. అక్కడ బోటింగ్ కూడా వుందండోయ్! కానీ సమయం లేదు. చెప్పాగా! మా ఆకలి కేకలు!

ఇవతలికి వచ్చాక అక్కడ చిన్ననాటి పుల్లైస్ అమ్ముతున్నారు. అవి ఆరోగ్యానికి మంచిది కాదు, పిచ్చి నీటిలో హానికారక రంగులు కలిపి చేస్తారంటూ పిల్లలకు చెప్పే నీతులన్నీ మామూలు రోజుల్లోనే! అక్కడ కనిపించిన పుల్ల ఐస్ తినడానికి పిల్లలకంటే ముందు మేమే సిద్ధపడిపోయాం. తర్వాత ఏడున్నర రైలు అందుకోవాలని కంగారుపడుతూ వెనక్కుమళ్లాం.

వరంగల్ సమీపించే కొద్దీ కోట ఎలాగూ చూడలేం. కనీసం ఊళ్లో వున్న 'వేయిస్థంభాల గుడి' చూడకుండా వరంగల్‌నుండి వెళ్లిపోవడమా అని నిరాశ చెందుతున్న మా 'ఆవేదన'ను అర్థంచేసుకున్నాడు ప్రతాపన్నయ్య. వీలుకాదంటున్న ఈశ్వర్‌ను ఓరగా చూస్తూనే, 'గుడి చూసే వెళ్దాం, సరేనా' అంటూ అభయమిచ్చాడు. ఆ మాటలు మాకా క్షణంలో అమృతసోనలే. కళ్లు ఆల్చిప్పలా చేసుకుని సిద్ధమైపోయాం. గుడి చేరేప్పటికే దీపాలు వెలిగించారు. వెయ్యి స్థంభాలెక్కడ, ఎక్కడ అనుకుంటూ అందరం దిక్కులు చూస్తుంటే ఎక్కడా ఏమీ లేవు. ఇదేంటని ఆరాతీస్తే ఆ గుడి నిర్మాణం స్థంభాలన్నీ కలిసినట్లుగా నిర్మించారట. ఇవికాక అనేక స్థంభాల మండపం ఒకటి కూలిపోయిందిట(ఆ! గుర్తొచ్చింది. ఆ మధ్య టివిలో చూశాంగా!) అవన్నీ లెక్కేసుకుంటే వెయ్యి స్థంభాలుంటాయట! నిజం చెప్పొద్దూ! నిరాశ కలిగింది. వేయి స్థంభాలంటే పే... ద్ద గుడి వుంటుందనీ, లెక్కలేనని స్థంభాలతో అలరారుతుంటుందనీ, తిరిగిచూడటం మావల్ల కాదనీ, ఇలా ఏదేదో ఊహించుకున్నాం. తీరా చూస్తే..! పోన్లే, చూడకుంటే ఇదొక్కటే మిగిలిపోయిందని సణుగుతూ కూర్చునేవాళ్లం. చూసేశాం కనుక పనైపోయిందని తృప్తిపడ్డాం.

మరి ట్రైన్ టైమయిపోతుందిగా! మళ్లీ హైరానా మొదలు. మీకిక ట్రైన్ దొరకదని డ్రైవర్. అయినా స్టేషన్‌కెళ్లి టికెట్లు కొంటామని కొందరు దారిలో దిగిపోయారు. మేమంతా బసకెళ్లి బ్యాగులు తీసుకుని ఒకటే పరుగులు. అప్పుడేం జరిగిందో ఊహించండి! ట్రైన్ అరగంట ఆలస్యమట! మామూలుగానైతే ఆలస్యానికి 'చింతిస్తాం'. కానీ అప్పుడు గెంతులేశాం. కానీ ఆ సంతోషం ఎంతోసేపు నిలవలేదు. ట్రైన్ ప్లాట్‌ఫాం మీదకొస్తోందని అనౌన్స్‌మెంట్. దాంతోపాటే మా హార్ట్‌బీట్‌లు పెరిగాయి. దీనికితోడు రైలొచ్చేది అవతలి ప్లాట్‌ఫాం. లగేజీలతో పిల్లలు ముందు, వెనకాల జాగ్రత్తంటూ అత్తయ్య, మామయ్యలతో మేమూ. మేం సరిగ్గా ప్లాట్‌ఫాం మీదకొచ్చేసరికి ట్రైన్ అలా వచ్చి ఆగింది. మేమిలా ఎక్కడం ఆలస్యం ఊపందుకుంది.

అంతటితో కథ పూర్తవలేదు. చరిత్ర పునరావృతమైంది. వారినీ, వీరిని బతిమలాడి పిల్లలను, పెద్దలనూ కూర్చోపెట్టాం. జోకులు, కబుర్లకు బదులుగా నీరసపు చూపులు, నొప్పులూ!

ఈ నీరసాలు, నొప్పులు రేపటికి మాయమైపోతాయి. కానీ మేం చూసిన ఆలయాల అలనాటి వైభోగం, శిథిల చరిత్ర తాలూకు జ్ఞాపకాలు ఎన్నటికీ మరపుకురావు. అలుపుకన్నా మిన్నగా ఆనాడు అందమైన ప్రకృతిలో తడిచిన అనుభూతి మమ్మల్నెన్నడూ అంటిపెట్టుకునే వుంటుంది. రొటీన్ జీవితం బోర్ కొట్టినపుడు ఇలాంటి పర్యటనలు మనలో ఎనలేని శక్తిని తీసుకొస్తాయి. ఉత్సాహంగా వుండటానికి కావలసిన బలాన్ని వెంటతెస్తాయి. ఇందులో ఎలాంటి సందేహమూ లేదు. అందుకోవడం, ఆనందించడం మన చేతిలో పని! కావాలంటే ప్రయత్నించి చూడండి!!

-కె.అరుణ

సీరియల్

వియత్నాం వీరుడు ఎన్‌గుయెన్ వాన్‌ట్రాయ్ పరిచయం

అది అక్టోబర్ 15, 1964. అమెరికన్ ముష్కరులు ఎన్‌గుయెన్ వాన్‌ట్రాయ్‌ని ఉరికంబానికి కట్టి షూట్ చేశారు.

అతనిది దక్షిణ వియత్నాం. 24 సంవత్సరాల యువకుడు. వృత్తిలో ఎలక్ట్రీషియన్, 1964 మే 10వ తేదీన అమెరికన్ రక్షణ శాఖ మంత్రి మెక్‌సమారా సైగాన్‌కు వస్తున్నాడని విన్నాడు. అప్పటికి అతనికి పెళ్ళయి 19 రోజులు మాత్రమే. అయినా ఆ కిరాతకుణ్ణి మట్టుపెట్టే ఛాన్సు మళ్ళీ వస్తుందా! అందుకే ఆ యాంకీ ప్రయాణం చేసే సమయానికి ఒక వంతెనను కూల్చాలని ట్రాయ్ పథకం వేశాడు. కాని పథకం తప్పింది. పట్టుబడ్డాడు. అతన్ని, అతని భార్యని, చుట్టాలనూ పక్కాలను అందర్నీ చుట్టుముట్టారు. అయిదు నెలల పాటు నానా హింసలకు గురిచేశారు.

ఈ లోగా ట్రాయ్ వీరోచిత గాథ దశదశలా మార్మోగింది. వెనిజులాలో విప్లవ గెరిల్లాయోధులు అతడి ప్రాణానికి ఒక అమెరికన్ సేనాని స్మోలెన్ ప్రాణాన్ని ఫణంగా ఒడ్డారు. ట్రాయిని ఉరి తీసిన మరుక్షణం తమ చేజిక్కియున్న మైకేల్ స్మోలెన్‌ని ఖతం చేస్తామని హెచ్చరించారు. ట్రాయ్‌ని ఉరితీయము అని వాషింగ్‌టన్ మాట యిచ్చి తమ సేనానిని విడిపించుకున్నది. అయినా నమ్మకద్రోహులూ అమెరికన్ సామ్రాజ్యవాదులు మాట తప్పి మరునాడే ట్రాయిని ఉరికంబానికి పంపారు.

ట్రాయ్ ఉదంతం జగత్ ప్రసిద్ధి కెక్కింది గనుక ఆ ఉదయాన అనేక మంది విదేశీ విలేకరులు అతని చుట్టూ మూగారు. అదొక పత్రికా గోష్ఠిగానే జరిగింది. ఆ యువకుడు గొంతు విప్పి ప్రపంచానికి తన ఆశయం విశదం చేశాడు.

“విలేకరులారా! మీరూ యువకులే. ఇక్కడేమి జరుగుతున్నదో మీరు తెలుసుకోవడం చాలా అవసరం. మా దేశంపై బడి దురాక్రమణ చేస్తున్న వాళ్ళు అమెరికన్లు. విమానాలతో బాంబులు వేసి మా ప్రజలను చంపుతున్న వాళ్ళు అమెరికన్లు. నా మాతృదేశాన్ని పూర్తిగా కబళించడానికి పథకం వేసినవాడు మెక్‌సమారా. నా మాతృభూమిని గాఢంగా ప్రేమిస్తున్న నేను నా దేశ స్వాతంత్ర్యం అమెరికా పాదాక్రాంతం గావడానికి అంగీకరించజాలను. మా ప్రజలకు వ్యతిరేకమైన పనేదీ నేను చేయలేదు. నేను చర్య తీసుకున్నది అమెరికన్లపైన. ఈ దేశంలో జరుగుతున్న అనేక ఘోరమైన నేరాలకు అసలు కారకుడైన మెక్‌సమారాను మట్టుబెట్టదలచాను.”

‘ఆఖరి క్షణాల్లో వున్నావు. ఏమైనా విచారాన్ని వెల్లడిస్తావా?” అని అడిగాడొక విలేకరి.

“మెక్ సమారాను మట్టుబెట్టలేకపోయానన్నదే నా విచారం.”

అలావాటు చొప్పున ఒక మతగురువు దగ్గరకొచ్చాడు ప్రార్థన చేసుకోమని చెప్పేందుకు.

“నేను పాపం చేసినవాడిని కాదు. పాపాలకు భైరవులు ఆ అమెరికన్లు. వాళ్ళ దగ్గరకే పొమ్మన్నాడు ట్రాయ్.

ట్రాయిని ఉరికంబానికి కట్టారు. అయినా ఆ యువకిశోరం గర్జిస్తూనే వున్నది. కళ్ళకు గంతలు కట్టారు. ఆ గంతను లాగి పారేసి, తనపై కెక్కుపెట్టి యున్న తుపాకుల వైపు నిర్భయంగా చూస్తూ ట్రాయ్ అన్నాడు.

“నా మాటలు గుర్తుంచుకోండి! అమెరికన్ సామ్రాజ్యవాదులు నశించాలి! గుయేన్‌ఖాన్ నశించాలి!”

“హోచిమిన్ వర్ధిల్లాలి! హోచిమిన్ వర్ధిల్లాలి! హోచిమిన్ వర్ధిల్లాలి”!

అతని గుండెపై గుళ్ళ వర్షం కురుస్తోంది. ఆ తెల్లని చొక్కా రక్తసిక్తమైంది. కొనవూపిరి కూర్చుకొని అంటూనే వున్నాడు ట్రాయ్.

“వి...య....త్...నామ్....వ...ర్ధి....ల్లా....లి! ” ట్రాయ్ అమరుడయ్యాడు.

‘ఒక ట్రాయ్ నేలకొరిగాడు. వేల కొలదీ ట్రాయ్‌లు లేచి నిలుస్తారు’, అన్న పోస్టర్లు తెల్లవారేసరికి సైగాన్ గోడలన్నిటి మీదా ప్రత్యక్షమయ్యాయి.

ట్రాయ్ హత్యకు పగదీర్చుకునేందుకు దక్షిణ వియత్నాం అంతటా వీరయోధులు విజృంభించి వేల కొలదీ అమెరికన్లనూ వాళ్ళ తొత్తులను మట్టుబెట్టారు. ఉత్తర వియత్నాంలో ట్రాయ్ పేరిట స్వాతంత్ర్య సమర యోధులు ఎక్కువ కష్టించి ఉత్పత్తి పెంచారు. ట్రాయ్ పంట కాలవలు’, ‘ట్రాయ్ ఉత్పత్తి దళాలు’, ‘ట్రాయ్ రైలు ఇంజన్లు’, మొదలైనవి రూపం దాల్చాయి.

ఆ విప్లవ వీరుడు ట్రాయ్ ఎక్కడివాడు? ఎలాంటి వాడు? ఏ విధంగా నివసించాడు? ఎటువంటి విప్లవ చర్యలు చేశాడు? శత్రు శిబిరంలో చిత్రహింసలకు గురవుతున్న ట్రాయ్ ఆ ముష్కరులకు సింహ స్వప్నంగా ఎలా ప్రవర్తించాడు?

ఇవన్నీ యీ రచనలో మీరు చదవాలి. ఇది అతని భార్య ఫాన్-ధి-కుయేన్ చెప్పిన గాథ. ట్రాయ్ వీరమరణానంతరం తప్పించుకొని విముక్తి ప్రాంతానికి చేరిన ఆమె జరిగిన కథంతా -ట్రాన్-దిన్-వ్యాన్‌కు చెప్పగా ఆయన చేశాడు యీ రచన.

స్వాతంత్ర్య ప్రియుల హృదయాలను కదిలించేది, ఉత్తేజం గొలిపేది ట్రాయ్ జీవిత కథ. ఇక చదవండి!

-మోటూరు హనుమంతరావు

లైట్ తీస్కో...

సీరియల్ తీస్తే...

వెంకాయమ్మ, సుబ్బాయమ్మ ఇరుగుపొరుగువారు. వీరిది సీరియళ్ల స్నేహం. ఈ టీవీ, మా టీవీ, జీ టీవీ, జెమినీ టీవీ...ఇలా ఒకటేమిటి...అన్ని చానళ్లూ వీరివే. ఏ ఒక్క సీరియల్ వదిలిపెట్టకుండా చూస్తారు. ఒకవేళ ఏదైనా అత్యవసర పనిబడి ఒకరు చూడలేకపోయినా... మరొకరు ఆ జరిగిన కథను వివరిస్తుంటారు. అప్పుడుగానీ వారికి మనశ్శాంతి వుండదు. అలా వారి సీరియల్ స్నేహం ముచ్చటగా మూడు సీరియళ్లు ...ఆరు ఎపిసోడ్లుగా సాగిపోతుండగా...ఓ ఐడియా వచ్చింది వెంకాయమ్మకు. ఒక ఐడియా ఓ జీవితాన్నే మార్చేస్తుందంటుంటారుకదా. మరి ఇక్కడేమైందో చూద్దాం.

వెంకాయమ్మ, సుబ్బాయమ్మ పెరట్లో కూర్చుని తీవ్రంగా ఆలోచిస్తుంటారు. మామూలుగా అయితే వారిద్దరూ ఆ సమయంలో సీరియళ్లు చూస్తూ యమా బిజీగా వుంటారు. ఎవ్వరు పిల్చినా పలికే స్థితిలో వుండరు. వారిని లేపాలీ అంటే... అది ఒక్క అడ్వర్టయిజ్‌మెంట్ వాళ్లకే సాధ్యం. సీరియల్ మధ్యలో ఏదైనా ప్రకటన వస్తేగానీ వారు కదలరు. అలాంటిది సీరియళ్లన్నిటినీ వదిలేసి ఇలా కూర్చుని ఆలోచిస్తున్నారూ...అంటే ఏదో పెద్ద కుట్రే జరుగుతోందనిపించింది వెంకాయమ్మ భర్త పాపారావుకి. అందుకే వారేం మాట్లాడుకుంటున్నారో వింటూ అక్కడే వుండిపోయాడు.

"వెంకీ! నీ ఐడియా సూపర్. ఇంతకీ మీ ఆయనతో చెప్పావా? ..." అంటూ ఆగిపోయింది సుబ్బాయమ్మ.

"ముందు మనిద్దరం మాట్లాడుకుని ఒక ఒప్పందానికొస్తే... తర్వాత వీలుచూసుకొని ఆయనతో మాట్లాడొచ్చు. తొందరేముంది" అంటోంది వెంకాయమ్మ.

(ఆ మాటలకు పాపారావ్ ఉడుక్కుంటూ...'అమ్మ సుబ్బాయమ్మా! నేనే మా ఆవిడను వెంకీ అని పిలవను. ఎంతగా ముదిరిపోయింది మీ స్నేహం! నాక్కూడా చెప్పకూడదు అనుకుంటున్నారంటే ఏదో పెద్ద ప్లానే వేసుంటారు. అదేంటో కనిపెట్టి తిత్తి తీయాలి...' అనుకున్నాడు మనసులో)

"అది కాదు వెంకీ! సీరియల్ అంటే మాటలా! మంచి కథ వుండాలి. ప్రేక్షకులు ఫెవికాల్ అతికించినట్టు కదలకుండా చూస్తూనే వుండాలి. కనీసం మూడు నాలుగు వేల ఎపిసోడ్లయినా తీయాలి. అలాంటి కిక్కున్న కథ నీకెక్కడిదీ..."

(అంటే సీరియళ్ల పిచ్చమ్మలిద్దరూ ఏకంగా ఒక సీరియల్‌నే తీయాలనుకుంటున్నారన్నమాట. అమ్మా...! విందాం...ఇంకా ఏం ప్లాన్ చేస్తున్నారో అనుకున్నాడు పాపారావు)

"ఎక్కడిదేవిటే ట్యూబులైటూ... ఇన్ని సీరియళ్లు చూశాక ఒక సీరియల్‌నైనా తీయకపోతే ఎందుకీ జన్మ. వృధా కాకపోతే"

"అయ్యో వెంకీ తెగ ముద్దొచ్చేస్తున్నావే... నువ్వు చెప్పే ఒక్కో మాటా వింటుంటే నీ నోట్లో డబ్బా చక్కెర పోయాలనిపిస్తోంది...ఊ...చెప్పు చెప్పు....ఎలాంటి కథ తీసుకొంటావ్?"

"ఆ...ఏముందీ! ఒక ఉమ్మడి కుటుంబం తీసుకుంటాం. అందులో ఎంతలేదన్నా ఇద్దరు ముగ్గురు లేడీ విలన్లను పెడతాం. అంతగా కావాలంటే మరో ఉమ్మడి కుటుంబంతో ఈ కుటుంబానికి స్నేహమో...శత్రుత్వమో పెడతాం. ఇంక ఇంతకు మించిన కథ ఎక్కడ దొరుకుతుంది చెప్పు...."

"అవును నువ్వు చెప్పింది రైటే. మనకు ట్యూబ్‌లైట్ వేసుకొని వెతికినా నిజజీవితంలో ఉమ్మడి కటుంబాలు కనపడవుగానీ...సీరియళ్లలో మాత్రం మొత్తం అన్నీ అవే. ఆ తర్వాత..."

"ఆ కుటుంబాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే వైరం పుట్టిస్తాం. ఒక ఇంటి నుంచి ఒకరిని కిడ్నాప్ చేయిస్తాం. దీనికే ఆరు నెలలు పడుతుంది.... ప్రకటనలు అవీ వుంటాయి కదా. అవన్నీ పోతూ కథ వచ్చేది ఐదు నిమిషాలేగా. నీకు తెలీనిదేముంది?..."

"మరి ఆ తర్వాత కథ నడిచేదెట్లా..."

"అయ్యో మరీ ఇంత అమాయకంగా అడిగితే ఎలా చెప్పు...దానికి ప్రతీకారంగా ఒక పనిమనిషిని ప్రత్యర్థి ఇంటికి పంపుతారు వీళ్లు. అక్కడ కోడలికో కూతురుకో... గర్భస్రావమయ్యేలా పథకం వేస్తారు...ఇదో ఆరునెలలు సాగుతుంది..."

"ఆ తర్వాత..."

"రెండు కుటుంబాల ఆడపిల్లలూ ఒక అబ్బాయినే ప్రేమించేట్టు కథ మారుస్తా...ఇద్దరమ్మాయిలూ అతన్నే పెళ్లి చేసుకోవాలని పోటీ పడుతుంటారు...ఎన్నో మలుపులు, కుతంత్రాల తర్వాత అతగాడు ఒకరిని పెళ్లి చేసుకుంటాడు..."

"ఆ...అప్పుడు శుభం కార్డు పడుతుందా"

"నీ బొంద. అప్పుడే అయిపోతే కిక్కేముంది? తర్వాత ఆ రెండో అమ్మాయి ఊరుకుంటుందా? మంచిగా నటిస్తూ మొదటి భార్యకు చెరుపు చేయాలనుకొంటుంది. వీలైతే ఆమె ప్రాణాలు తీయించడానికి కూడా వెనుకాడదు.."

"అబ్బో వెంకీ .... నీ ఐడియా సూపరో సూపర్...ఆ తర్వాత...అతన్ని ఈమె పెళ్లి చేసుకొంటుంది. సీరియల్ అయిపోతుంది . అంతేనా!"

"అంతేనా! ఈ పని చేయించింది ఆమేనని తెలిసి తనను అసహ్యించుకుంటున్నాడని ఆ అమ్మాయి తెలుసుకొని ఏం చేస్తుందంటే..."

"ఆత్మ హత్య చేసుకొంటుందా?"

"లేదు ప్లాస్టిక్ సర్జరీ చేయించుకొని అతని జీవితంలోకి అడుగెడుతుంది..."

"అబ్బో...వెంకీ! ఇదే ఐడియాతో సీరియల్ తీస్తే మాత్రం నాలుగైదేళ్లపాటు నిర్విఘ్నంగా సాగదీసుకోవచ్చు. డబ్బు సంపాదించుకోవచ్చు..."

అంటుండగానే...పక్కనే యమ టెన్షన్‌తో వీళ్ల మాటలు వింటున్న పాపారావ్ బయటకొచ్చి

"...ఆ ఈ సీరియల్‌తో జీడిపాక సీరియల్ రత్న అవార్డు కూడా కొట్టేయొచ్చు" అన్నాడు నిష్ఠూరంగా.

"అయ్యో అన్నయ్యగారూ మీరా! మొత్తం వినేశారా!"

"ఆ...నా టైమ్ బాగోక అన్నీ నా చెవిన పడ్డాయమ్మా....ఇంతకీ ఈ ముదనష్టపు సీరియల్ తియ్యడానికి డబ్బులిచ్చే వెర్రి బాగులోడెవరమ్మా..."

"అయ్యో ఇంకెవరూ...మీరూ...మా వారూ.."

అంతే పాపారావ్ అక్కడ కనబడితే ఒట్టు.



- అంజన

వికాసం

పెద్దల పోరు పిల్లల బేజారు

మాధవ్, మంజు మధ్య పోరు మాంచి రసపట్టులో వుంది. ఇద్దరూ ఏమాత్రం తగ్గకుండా తగాదా ఆడుకుంటున్నారు. మూర మల్లెపూల దగ్గర మొదలైన కలహం అటు ఏడు తరాలు ఇటు ఏడు తరాలను వేలెత్తి చూపుకునే వరకు వెళ్లింది. కళ్లు పెద్దవి చేయడాలూ, నొసలు చిట్లించడాలూ, ముక్కుమూతి విరవడాలూ, చెంగు బిగించడాలూ, లుంగీ ఎత్తి కట్టడాలూ, మీసాలు మెలేయడాలూ...అన్నీ జరిగిపోతున్నాయి. పోట్లాటలో వీరిలా చెలరేగిపోతోంటే పిల్లలు మాత్రం బిక్కచచ్చిపోయి సోఫాలో ఓ మూలన కూర్చుండిపోయారు. అమ్మానాన్నలను అలా చూసేసరికి చిన్నారులకు ఏం చేయాలో తోచక అమ్మ మాట్లాడేప్పుడు అమ్మ వైపు ...నాన్న మాట్లాడేప్పుడు నాన్న వైపు చూస్తున్నారు. పసివాళ్లకు ఓవైపు ఆకలి. మరోవైపు అడగడానికి భయం.

కాపురం అన్నాక చిరుచిరు అలకలు...కలహాలు సహజమే. అయితే అవి చిలికి చిలికి గాలివాన కాకుండా చూసుకోవాలి. ముఖ్యంగా పిల్లలున్న వారు మరింత జాగ్రత్తగా వుండాలి. కొందరికి ముక్కుమీద కోపం వుంటుంది. అస్సలు సహనం పాటించలేరు. చీటికీ మాటికీ పందెంకోళ్లలా రెచ్చిపోతుంటారు. భార్యాభర్తలు ఇలా పోట్లాడుకోవడం ఇరుగుపొరుగుకు వినోదంగానే వున్నా ఇంట్లో వారికే మనశ్శాంతి వుండదు. మరీ ముఖ్యంగా ఇంట్లో పిల్లలకు అలజడిగా వుంటుంది. నిత్యం అశాంతి తాండవించే ఇళ్లల్లో పెరిగిన పిల్లలకు మానసిక సమస్యలు ఎదురయ్యే అవకాశముందంటారు మరి.

చిన్ని కారణమే...

మొగుడూపెళ్లాల మధ్య కలహం మొదలవ్వడానికి పెద్ద పెద్ద కారణాలేం అక్కర్లేదు. చిన్ని కారణమే పెద్ద తుఫానుకు కారణమవ్వవచ్చు. కాఫీలో చక్కెర తక్కువైందనో, ఎక్కువైందనో చిందులేసే మగవారుంటారు. అంతగా తనను బజారు తీసుకెళ్లి చిట్టి గులాబీ పువ్వు కూడా కొనివ్వలేదని తగాదాకి రంగం సిద్ధం చేసుకునే మహిళలూ వుంటారు. అందువల్ల తెలిసేదేమంటే 'ఇదిగో ఈ కారణం వల్లే తగాదా వస్తుంది' అని చెప్పడం బహు కష్టం. అది ఆయా వ్యక్తులను బట్టి, కుటుంబ వాతావరణాన్ని బట్టి, పరిస్థితులను బట్టి వుండొచ్చు.

చిలికి చిలికి...

అలా చిన్ని కారణంతో మొదలైన వాగ్యుద్ధం చిలికి చిలికి గాలివానగా తయారౌతుంది. ఆ సమయంలో ఇంట్లో ఏవైనా వస్తువులు గాలిలోకి ఎగిరి రావచ్చు. సమయానికి అడ్డొచ్చిన వారికెవరికైనా తగలొచ్చు. కిందపడి పగిలిపోవచ్చు. విరిగిపోవచ్చు. ఏదైనా జరగొచ్చు. అయితే ఇవన్నీ మనకు కంటికి కనిపించే నష్టాలు. పరిణామాలు. కానీ కంటికి కనిపించకుండా జరిగేవి కొన్ని వుంటాయి. ఆ భార్యాభర్తలు కూడా తమ ఎదురుగా పిల్లలున్నారన్న విషయం మర్చిపోయి మరీ రెచ్చిపోతారే... అదే అసలు నష్టం. ఆ చిన్ని మనసులపై పెద్దల కలహాలు, మాటలు చెరగిపోని ముద్రలు వేస్తాయి. వారి భావి ప్రవర్తనపై ఎంతోకొంత ప్రభావాన్ని చూయిస్తాయి.

ఈ విషయం తెలియకపోతే అదో అమాయకత్వం అనుకోవచ్చు. తెలిసిన పెద్దలు కూడా తగాదా వచ్చేసరికి 'ఆ...ఏముంటుందిలెద్దూ' అనేసుకొని తగాదాలో మునిగిపోతారు. కొందరైతే 'తగాదా ఆడుకునేప్పుడు పసిపిల్లల పర్మిషన్ తీసుకోవాలా? అయినా పిల్లకుంకలు వారికేం తెలుసు?' అనేస్తారు చాలా సులభంగా. అంతేకాక పోట్లాటకు కావాల్సిన సరంజామానంతా వారి ముందే సమకూర్చుకుంటారు. అది వాక్బాణాలు కావొచ్చు... పరిసరాల్లో వుండే వస్తువులు కావొచ్చు.

అమ్మానాన్నల కీచులాటలు పిల్లలను భయపెట్టేస్తాయి. అనవసరమైన భయాందోళనకు గురిచేస్తాయి. తమలో కలిగిన భయాన్ని, ఆందోళనను పైకి చెప్పలేకపోయినా వారిని వెంటాడుతూనే వుంటాయి. పోట్లాట మూడ్‌లో పిల్లల భావాలను పెద్దలు గుర్తించలేకపోయినా పిల్లల ప్రవర్తనలో మాత్రం కన్పిస్తుంది. అమ్మానాన్నల మధ్య జరిగే తగాదాలు చిన్నారులను స్తుబ్దులుగా చేస్తాయని అధ్యయనాలు చెప్తున్నాయి. పైగా అటువంటి సమయాల్లోనే చిన్నారులకు పెద్దల పట్ల వున్న గౌరవం తగ్గుతుంది. ఒకరకమైన అభద్రతా భావం వారిలో చోటుచేసుకొంటుంది. తోబుట్టువులు, స్నేహితులతో చిన్న విషయానికి కూడా తగాదా పడే అవకాశముంది.

కొంచెం చదువుకున్నవారు, పరిణతి కలిగినవారు మాత్రం పిల్లల ముందు పోట్లాడుకోరు. పిల్లలు లేని సమయంలోనో, లేక తమ గదిలోనో తిప్పలు పడతారు. ఇంకొందరైతే అదీ ఇదీ కాకుండా మాట్లాడకుండా మౌనవ్రతంతో చంపేస్తారు. అదో రకమైన ఇబ్బందికర వాతావరణాన్ని సృష్టిస్తారు. అదో రకమైన హింసనుకోండి.

భార్యాభర్తలన్నాక ఏవో తేడాలు వస్తూనే వుంటాయి. మాటా మాటా అనుకుంటుంటారు. అయితే పిల్లలు చూస్తున్నప్పుడు కోపావేశాలు ప్రకటించుకోకుండా జాగ్రత్తపడాలి. వీలైతే వారు లేనప్పుడు తేడా వచ్చిన అంశాలపై మాట్లాడుకోవాలి. పైగా అలాంటి చిన్నచిన్న తగాదాలు జీవితంలో వస్తూనే వుంటాయని వాటి గురించి పట్టించుకోకూడదని పిల్లలకు చెప్పుండాలి. ఎందుకంటే అమ్మానాన్నలను అంత ఉగ్రరూపంలో పోట్లాడుకోవడం చూసి ఇంక వారు ఎప్పటికీ మాట్లాడుకోరేమో అనుకున్నా ఆశ్చర్యంలేదు. కానీ పెద్దలు అప్పటికి అంత తీవ్రంగా తగాదా పడ్డా...మరునాటికో, రెణ్ణాళ్లకో మాటలు కలుపుకోవడం సహజమే. అదే పిల్లలకూ అర్థమయ్యేలా వివరించాలి.

- చరిత

నవ్వుల్ - పువ్వుల్

ఆవిడెక్కడ?

అప్పారావు: ఏంటి సుబ్బారావు! మీ ఆవిడ ఇంట్లో లేదా? నువ్వే వంట చేస్తున్నావ్!!!
సుబ్బారావు: చీరలు కొంటానని వెళ్ళింది, వారం అవుతోంది బ్రదర్!

ఉపాయం

కష్టమర్: ఏమోయ్ సప్లయిరూ...ఇటురా! చూడు ఉప్మాలో బొద్దింక..బొ...బొద్దింక!!! కనిపించిందా?
సప్లయర్: ఆగండి సర్, గాబరా పడకండి! అదుగో ఆ గోడమీద బల్లి వుంది! తీసుకొస్తా!!!

భలే లెక్క

టీచర్:గోపీ! మీ ఇంటి నుండి మా ఇంటికి ఆరు కిలో మీటర్లు దూరం అనుకో! మరి మా ఇంటి నుండి మీ ఇంటికీ ఎన్ని కిలోమీటర్లు?
గోపి:పది కిలో మీటర్లు అనుకోండి! ఎందుకంటే నేను ఎగ్రస్టా దారుల్లోంచి మీ ఇంటికి వస్తాను!

గడియారం

తండ్రి: తల్లీ! నీ పుట్టినరోజు బహుమతిగా ఏం కావాలో కోరుకో.
కుమార్తె: నాకు టైమ్ చెప్పే గడియారం కావాలి నాన్నా!
తండ్రి: ఏం ఇప్పుడు నీ చేతికి వున్న గడియారం టైమ్ చెప్పడంలేదా?
కుమార్తె: లేదు నాన్నా! నేను దాని వైపు చూడాల్సివస్తోంది.

పరిగెడదాం

(ఓ పిల్లవాడు కాలింగ్ బెల్ నొక్కడానికి ప్రయత్నిస్తుంటాడు. కానీ అందదు. ఈలోగా అటుగా వెళుతున్న ఓ పెద్దమనిషి వచ్చి బెల్లు కొట్టి...)

పెద్దమనిషి: ఇప్పుడేమంటావు?
పిల్లవాడు: ఏమంటానుసార్. పరిగెడదామంటాను. ఎందుకంటే ఇది మా ఇల్లు కాదు. ఊరకే కాలింగ్ బెల్లు నొక్కాలనిపించి ట్రై చేశా.

కె. పద్మ, ఒమ్మెవరం.

ముందు

కనకం: మా ఇంట్లో అద్దెకున్నావిణ్ణి ఖాళీ చేయించేశా.
కాంతం: ఏం అద్దె సరిగ్గా కట్టడం లేదా?
కనకం: అదేం కాదు. ఎప్పుడూ నాకన్నా ఖరీదైన నగలు, పట్టు చీరలు కొనుక్కుంటుంది. అందుకని అద్దె డబుల్ చేస్తానని బెదిరించా.

పళ్ళు-రాళ్ళు

భర్త:ఏమేవ్! రెండు కళ్ళు బాగానే కనబడతున్నాయి కదా బియ్యంలో ఈ రాళ్ళేంటి?
భార్య:మీకు ముప్పైరెండు పళ్ళు బాగానే ఉన్నాయిగా ఆ మాత్రం నమలలేరా!

ఎ.ఖాజామెహిద్దిన్, మిర్యాలగూడ

ఆస్తి గోల

తండ్రి: నా మాట ధిక్కరించి ప్రేమ పెళ్ళి చేసుకున్నావ్! నా ఆస్తిలో నీకు చిల్లి గవ్వ ఇవ్వను!!
కొడుకు: ఆ చిల్లి గవ్వలు నువ్వే వుంచుకో! నీకున్న వంద ఎకరాల్లో అందాక యాభై ఎకరాలు నాపేర రాయించు నాన్నా! నీ కోడలు, నేను సరిపెట్టుకుంటాం!!

దృష్టిదోషం

వెంకటరావ్: (రైలుప్రయాణంలో) కాంతం నిన్ను చూసి అప్పుడే 60 ఏళ్ళు దాటాయి! మన పెళ్ళి కలగానే మిగిలిపోయింది!
ప్రయాణీకురాలు: క్షమించండి సర్! నేను మీ కాంతాన్ని కాను!!! సుబ్బరావుగారి ఇల్లాలిని! కళ్ళజోడు మార్చుకోండి.

వామ్మో మందులు

డాక్టర్: రాత్రిపూట బాగా నిద్రపడుతోందా? నేను ఇచ్చిన మందులు బాగా పనిచేస్తున్నాయా!
పేషెంట్: మీ మందులు వాడక ముందు అందమైన ఆడవాళ్ళు కలలోకి వచ్చే వారు. ఇప్పుడు మీ మందులు వాడుతుంటే శ్మశానం కలలు వస్తున్నాయ్ డాక్టర్!!!

జె.సుధాకర్‌రావు పట్నాయక్, కాకినాడ.

జోక్స్ బాగా వేస్తారా? మరైతే ఆలస్యం ఎందుకు! కార్డు మీద రాసి పంపండి. పాఠకులను కడుపుబ్బ నవ్వించండి. మా చిరునామా:
స్నేహ, ప్రజాశక్తి దినపత్రిక, ఎం.హెచ్.భవన్, ప్లాట్‌నెం.21/1, ఆజమాబాద్, ఇండస్ట్రియల్ ఏరియా, హైదరాబాద్

తెలుగు తెరపై కంప్యూటర్ మహేంద్రజాలం

-రెంటాల జూనియర్



ఓ పెద్ద కొండ అంచు మీద కూర్చొని హీరో, హీరోయిన్లు ప్రణయ గీతం పాడుకోవడం (కొమరం పులి) రెండు కొండల నడుమ ప్రవహిస్తున్న నదికి కొన్ని వందల అడుగుల ఎత్తున చెక్క వంతెనపై హీరో, విలన్ల మధ్య సంఘర్షణ (మర్యాద రామన్న) చుట్టూరా భయంకరమైన లోయ - మధ్యలో ఎప్పుడు కూలిపోతుందా అనిపించే ఇరుకైన దోవ - ఆ దోవ మీదుగా వచ్చే వైరి వీరులతో హీరో వీరోచిత పోరాటం (మగధీర) ...ఇలాంటివన్నీ మామూలుగా సాధ్యమయ్యేవేనా? పోనీ, చిత్రీకరణకైనా కుదిరేవేనా? కావు గాక కావు. మరి వెండి తెరపై అవి ఎలా సాధ్యమయ్యాయి అంటారా? అవన్నీ మామూలుగా తీసిన దృశ్యానికి, కంప్యూటర్ అద్దే గ్రాఫిక్స్ మాయే!

గత ఏడాది మొదట్లో 'అరుంధతి', మధ్యలో 'మగధీర', చివరలో హాలీవుడ్ 'అవతార్' విడుదలయ్యాయి. గమనిస్తే, ఈ మూడూ తమ తమ స్థాయిలో గ్రాఫిక్స్‌ను కథలో అంతర్భాగంగా అద్భుతంగా వినియోగించుకొన్నవే. అపూర్వమైన దృశ్య సంయోజనంతో ప్రేక్షకులను ఆకట్టుకొన్నవే. దాంతో, ఇవాళ తెలుగు సినిమా రంగంలో స్పెషల్ ఎఫెక్ట్స్ ఓ ముఖ్యస్థానాన్ని సంతరించుకున్నాయి. నిజానికి, కొన్నేళ్ళుగా తెలుగు సినిమాల్లో గ్రాఫిక్స్‌ను ఉపయోగిస్తున్నా, 'అరుంధతి', 'మగధీర' చిత్రాల అఖండ విజయం తరువాత తెలుగు దర్శక, నిర్మాతల దృష్టి ఈ కంప్యూటర్ జనరేటెడ్ ఇమేజరీ (సి.జి.ఐ)పై ఎక్కువైంది.

'అరుంధతి' తరువాత సరిగ్గా ఆరున్నర నెలలకు (జులై 2009) విడుదలైన 'మగధీర' చిత్రం కూడా స్పెషల్ ఎఫెక్ట్స్‌తో జనాన్ని మంత్రముగ్ధుల్ని చేసింది. ఉదయగఢ్ కోట, కోటలోని జన సభాంగణం, ఎత్తయిన పర్వతం మీద కథానాయక పాత్ర కాలభైరవ సాగించే వీరోచిత పోరాటం, కథానాయిక పాత్ర మిత్రవిందతో కలసి కథానాయకుడు కొన్ని వందల అడుగుల లోతైన లోయలోకి పడిపోవడం లాంటి ఆ సినిమాలోని దృశ్యాలన్నీ కంప్యూటర్ ద్వారా సృష్టించిన గ్రాఫిక్స్ మాయలే. ఇలాంటి విజువల్ ఎఫెక్ట్స్‌తో జీవం పోసుకున్న ఆ పునర్జన్మ నేపథ్య జానపద కథకు జనం బ్రహ్మరథం పట్టి, తెలుగు సినిమా వసూళ్ళ చరిత్రలో పాత రికార్డులన్నీ బద్దలు కొట్టించేశారు. దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి దర్శకత్వంలో రామ్‌చరణ్ తేజ నటించిన ఈ చిత్రానికి ఆర్. కమల్ కణ్ణన్ బృందం సమకూర్చిన స్పెషల్ ఎఫెక్ట్స్‌కు చివరకు జాతీయ స్థాయిలోనూ గుర్తింపు లభించింది. 2009వ సంవత్సరానికి గాను ఇటీవల ప్రకటించిన 57వ జాతీయ అవార్డుల్లో స్పెషల్ ఎఫెక్ట్స్ విభాగంలో కమల్ కణ్ణన్‌కు అవార్డు ప్రకటించారు. ఈ అవార్డు కింద ఆయనకు రజత కమలం, రూ. 50 వేల నగదు బహుమతి అందజేయనున్నారు.

పెరిగిన ఆదరణతో బడ్జెట్‌లో పెరిగిన వాటా

స్పెషల్ ఎఫెక్ట్స్‌కు జనం నుంచి వస్తున్న విశేష ఆదరణతో యువతరం దర్శకులు, రచయితలు తమ చిత్రాలలో స్పెషల్ ఎఫెక్ట్స్‌లతో ప్రయోగాలకు సిద్ధమవుతున్నారు. వాటితో ప్రేక్షకుల ఆదరణ చూరగొనాలని ప్రయత్నిస్తున్నారు. ఇటీవల కొన్ని సినిమాల బడ్జెట్‌లో గ్రాఫిక్స్ కోసం గణనీయమైన మొత్తాన్నే కేటాయిస్తున్నారు. లక్షల్లో మొదలై 'అరుంధతి', 'మగధీర' లాంటి కొన్ని సినిమాలకు అది కోట్లకి ఎగబాకింది. తాజాగా భారతదేశంలోనే అత్యధిక బడ్జెట్‌తో రూపొందుతున్న చిత్రంగా (రూ. 150 - 160 కోట్లని వినికిడి) ప్రచారమవుతున్న రజనీకాంత్ - దర్శకుడు శంకర్‌ల 'రోబో'లో స్పెషల్ ఎఫెక్ట్స్‌ల కోసం కనివిని ఎరుగని మొత్తం

వెచ్చించారు. ఆ సినిమా మొత్తం బడ్జెట్‌లో దాదాపు 40 శాతం స్పెషల్ ఎఫెక్ట్‌లకే ఖర్చయింది. 'జురాసిక్ పార్క్', 'ప్రిడేటర్', 'టెర్మినేటర్', 'ఐరన్ మ్యాన్', ఇటీవలి 'అవతార్' వరకు అనేక చిత్రాల్లో అద్భుతమైన పని తీరు చూపిన హాలీవుడ్‌లోని నంబర్ వన్ స్టూడియో 'స్టాన్ విన్‌స్టన్ స్టూడియో' ఇప్పుడు మన 'రోబో' చిత్రం కోసం పనిచేసింది. "ఆ స్టూడియోలోని యానిమాట్రానిక్స్ టెక్నాలజీని ఉపయోగించుకున్న తొలి భారతీయ చిత్రం 'రోబో'యే" అని దర్శకుడు శంకర్ సగర్వంగా చెప్పారు. ఈ సినిమాకు హాంగ్‌కాంగ్‌కు చెందిన కంప్యూటర్ గ్రాఫిక్స్ నిపుణులు పనిచేశారు. నిజానికి, గ్రాఫిక్స్ రూపకల్పన అనేది శ్రమతో పాటు, సమయం కూడా పట్టే సృజనాత్మక కృషి. అందుకే, వీటి కోసం పెద్ద సంఖ్యలో నిపుణులు పనిచేయడం కద్దు. 'మగధీర' గ్రాఫిక్స్ కోసం దాదాపు 45 మంది నిపుణులు రోజుకు మూడు షిఫ్టుల్లో ఓ ఏడాదంతా పనిచేశారు. పైగా, ఏ సినిమాకైనా సరే పూర్తిగా ఒక్క సంస్థే గ్రాఫిక్స్ పని చేయదు. రెండు, మూడు సంస్థలు కలిసి పనిచేస్తుంటాయి. రజనీకాంత్ 'రోబో' గ్రాఫిక్స్ పనిలో చెన్నై, హాంగ్‌కాంగ్‌లలోని నిపుణులతో పాటు మన హైదరాబాద్‌లోని గ్రాఫిక్స్ నిపుణుల త్రయం కమల్ కణ్ణన్ - ఆదిల్ అదిలి - పీటర్ డ్రేపర్‌కు చెందిన 'మకుటా వి.ఎఫ్.ఎక్స్. ప్రైవేట్ లిమిటెడ్' సైతం పాలుపంచుకుంది. ఇవన్నీ దృష్టిలో పెట్టుకొనే, "గ్రాఫిక్స్ విషయంలో ఎంతో ఓపిక కావాలి. పని చేసే మాతో పాటు, పని చేయించుకొనే దర్శక - నిర్మాతలకూ ఓపిక ఉండాలి" అని రాజమౌళి 'యమదొంగ'లోనూ, తాజా 'మర్యాద రామన్న'లోనూ గ్రాఫిక్స్ చేసిన కమల్ కణ్ణన్ అన్నారు. 'మర్యాద రామన్న'లోని పతాక సన్నివేశంలో నీటికి కొన్ని వందల అడుగుల ఎత్తున చెక్క వంతెన దృశ్యాలన్నీ ఆయన చేసిన విజువల్ ఎఫెక్ట్‌లే! సినిమాలో కలిసిపోయి, సహజంగా కనిపించిన ఆ దృశ్యాలు ఎఫెక్ట్స్ అన్న విషయం ఆయన నేతృత్వంలోని గ్రాఫిక్స్ బృందం వెల్లడించే వరకూ ఎవరూ కనిపెట్టలేకపోయారు.

తెలుగునాట స్పెషల్ ఎఫెక్ట్‌ల శకారంభం

ఒక్కసారి వెనక్కి వెళితే, మన సినిమాల్లో ఈ గ్రాఫిక్స్ విజృంభణకు కారణం కనిపిస్తుంది. తెలుగు ప్రజలకు 1995లో ఉపగ్రహ తెలుగు టీవీ చానళ్ళ రుచి తెలిసింది. వెండితెర ప్రేక్షకులు కాస్తా బుల్లితెర వీక్షకులుగా పరిమితమైపోయారు. వారిని సినిమా హాళ్ళకు రప్పించడమెలా అన్నది 1990ల చివరిలో దర్శక, నిర్మాతలకు పెను సవాలై కూర్చుంది. కథలో సృజనాత్మకత మాటెలా ఉన్నా చిత్రీకరణలో కొత్తదనం చూపడానికి తాపత్రయం పెరిగింది. ఈ పరిణామక్రమంలో భాగంగా స్పెషల్ ఎఫెక్టులు, గ్రాఫిక్స్‌కు 1990లలో తెలుగు తెర స్వాగతం పలికింది. రజనీకాంత్, గౌతమి జంటగా నటించగా ఏ.వి.ఎం. సంస్థ తమిళంలో నిర్మించిన 'రాజా... చిన్న రోజా' ('89) చిత్రంలో కార్టూన్ యానిమేషన్‌ను చిత్రమంతటా విరివిగా ఉపయోగించారు. కార్టూన్ పాత్రలు, నటీనటులతో కలసి సినిమా కథ మొత్తం నడుస్తుంది. ఆ చిత్రం అదే పేరుతో తెలుగులోకి అనువాదమై, విడుదలైంది. ఆ తరువాత వెంకటేష్ నటించిన 'బొబ్బిలి రాజా' (90)లో నేరుగా తెలుగు తెరపై తొలిసారి కార్టూన్ యానిమేషన్ కనిపించింది. అయితే, ఈ చిత్రంలో ఒక్క పాటలోనే కార్టూన్ యానిమేషన్ వాడారు. వెంకటేష్, దివ్యభారతి నటించగా, వారితో పాటు 'జంగిల్ బుక్'లోని ఎలుగుబంటి, కొండచిలువ లాంటి వన్యప్రాణుల కార్టూన్ బొమ్మలు కూడా ఆడే 'కన్యాకుమారి కనబడదా దారి...' పాట అప్పట్లో ఓ సంచలనమైంది.

తొలి దశ 3డి గ్రాఫిక్స్

ఆ తరువాత తెలుగు సినిమా 3డి గ్రాఫిక్స్ దశకు ఎదిగింది. నందమూరి బాలకృష్ణ నటించిన జానపద చిత్రం 'భైరవద్వీపం' (94) తెలుగులో తొలి 3డి గ్రాఫిక్స్ సినిమాగా చరిత్రకెక్కింది. ప్రసిద్ధ 'విజయ' సంస్థకు సోదర నిర్మాణ సంస్థగా వెలిసిన 'చందమామ - విజయ కంబైన్స్' నిర్మించగా, ప్రయోగశీల దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం ఆబాలగోపాలాన్నీ అలరించింది. మరుగుజ్జు మానవులు, 'నరుడా ఓ నరుడా ఏమి కోరిక...' పాటలో గంధర్వ కన్య (నటి రంభ) దగ్గర నుంచి తాళం చెవిని తెలివిగా దొంగిలించడం కోసం వారు పడే పాట్లు లాంటి దృశ్యాలన్నీ అప్పటికీ, ఇప్పటికీ ఆసక్తి కలిగించే గ్రాఫిక్సే! వాస్తవానికి, ఈ గ్రాఫిక్స్ ప్రయత్నాలు అంతకన్నా ముందే మొదలయ్యాయి. బాలకృష్ణ నటించిన తల్లితండ్రులు (1991) చిత్రంలో చివరి పాట (ఇంటీరియర్ డెకరేషన్ గురించి హీరో, హీరోయిన్లు పాడే పాట)లో గ్రాఫిక్స్ వాడారు. ఇక, ఆదిత్య 369 (1991)లో టైమ్ మెషిన్‌లో ప్రయాణఘట్టంలో (ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ వగైరా కనిపిస్తారు) భాగంగా కథలో విస్తృతంగా గ్రాఫిక్స్ వాడారు. అయితే, అప్పట్లో కంప్యూటర్‌లో చేసిన గ్రాఫిక్స్‌ను వెండితెర మీదకు ఎక్కించేందుకు తగిన నాణ్యమైన యంత్రాలు, సాంకేతిక పరిజ్ఞానం మనకు రాలేదు. దాంతో, తెరపై చూపిన తుది దృశ్యం చుక్కలు, చుక్కలుగా కొంత అస్పష్టంగా ఉండేది. ఆ తొలినాళ్ళ ప్రయత్నాలన్నీ చివరకు భైరవ ద్వీపం (94)లో ఫలించి, గ్రాఫిక్స్ ఎఫెక్ట్ తెలుగు తెరపై తొలిసారిగా గొప్పగా కనిపించింది.

కంప్యూటర్ గ్రాఫిక్స్ హవా

ఈ గ్రాఫిక్స్ వెల్లువ 'అమ్మోరు' (95)తో శిఖరస్థాయికి చేరి, ఇవాళ్టి 'అరుంధతి' (2009) వరకు తెలుగు సినిమాకు కొత్త ఊపిరి ఊదుతూనే ఉంది. సౌందర్య, రమ్యకృష్ణ నటించిన 'అమ్మోరు'

స్పెషల్ ఎఫెక్ట్స్ అంటే....

చాలా సందర్భాల్లో చుట్టుపక్కల ఆ వాతావరణం ఏమీ లేకుండా ఏ నీలిరంగు తెర (బ్లూ మ్యాట్) ముందో, ఆకుపచ్చ రంగు తెర (గ్రీన్ మ్యాట్) ముందో నిలబడి సన్నివేశం చిత్రీకరిస్తారు. ఆ తరువాత దానికి కథానుగుణంగా కావాల్సిన పరిసర వాతావరణాన్ని కంప్యూటర్‌లో సృష్టించి కలుపుతారు. అదే స్పెషల్ ఎఫెక్ట్. అయితే, తెరపై వాటిని చూసినప్పుడు నిజంగానే అంత ఎత్తున ఆ సన్నివేశం జరిగిందనే భావన ప్రేక్షకుడికి కలుగుతుంది. వెరసి ఆ స్పెషల్ ఎఫెక్ట్ సక్సెస్! కథ, కథనాలు కూడా బాగుంటే సినిమా కూడా సూపర్ హిట్!!

"సి.జి." అని పరిశ్రమలోని వారు మోటుగా తరచూ పేర్కొనే ఈ 'కంప్యూటర్ జనరేటెడ్ ఇమేజరీ' (సి.జి.ఐ)కే 'గ్రాఫిక్స్', 'స్పెషల్ ఎఫెక్ట్స్' (ఎస్.ఎఫ్.ఎక్స్), 'విజువల్ ఎఫెక్ట్స్' (వి.ఎఫ్.ఎక్స్) - ఇలా ఎన్నో పేర్లున్నాయి. పేర్లు ఎన్ని ఉన్నా, విషయం మాత్రం ఒకటే: కథలోని సన్నివేశానికి తగ్గట్లు కంప్యూటర్‌లో కల్పించిన మాయ, తీరా వెండితెరపైకి వచ్చేసరికి వాస్తవంలాగా అనిపించడం! లేని లోకాన్ని కూడా కళ్ళెదుటే ఉన్నట్లు భ్రమింపజేస్తూ, ప్రేక్షకుణ్ణి ఉద్విగ్నతకు గురిచేయడం! ఒక్క ముక్కలో - వెండితెరపై కంప్యూటర్ మహేంద్రజాలం.

సినిమా పతాక సన్నివేశాల్లో పీఠం మీది అమ్మవారి విగ్రహం వ్యాఘ్రాన్ని అధిరోహించిన శక్తి స్వరూపిణిగా మారడం, పది చేతులతో అమ్మవారు మాంత్రికుణ్ణి సంహరించి, కాలితో తొక్కి భస్మం చేయడం లాంటి గ్రాఫిక్స్ ప్రేక్షకుల్ని పదే పదే హాలుకు రప్పించాయి. ఆ తరువాత అదే చిత్ర నిర్మాత ఎం. శ్యామ్‌ప్రసాద్ రెడ్డి ఏళ్ళ తరబడి నిర్మించిన 'అంజి' (2004) మరో చరిత్ర సృష్టించింది. తెలుగు తెరపై గ్రాఫిక్స్ అద్భుతంగా ఆవిష్కృతమైన 'అంజి' చిత్రం అందుకు గుర్తింపుగా జాతీయ అవార్డు కూడా అందుకుంది. ఆ చిత్రానికి గ్రాఫిక్స్ సృష్టించడంలో కృషి చేసిన సనత్‌కు 52వ జాతీయ అవార్డుల్లో స్పెషల్ ఎఫెక్ట్స్ విభాగంలో ఆ అవార్డు వచ్చింది. "మొత్తం 67 మంది గ్రాఫిక్స్ నిపుణులు నెలల తరబడి శ్రమించి, 'అంజి'ని సృష్టించారు. ఆ కృషికి లభించిన గుర్తింపు అది" అని శ్యామ్‌ప్రసాద్ రెడ్డి అన్నారు.

'అంజి' చిత్రం కోసం కూడా ఆయన, 'అమ్మోరు'కు పని చేసిన హాలీవుడ్ గ్రాఫిక్స్ నిపుణుడు క్రిస్‌నే మొదట ఆశ్రయించారు. అతణ్ణి చిత్రీకరణ కార్యకలాపాల్లో సైతం భాగస్థుణ్ణి చేశారు. అయితే, విదేశాల్లోని అతని సంస్థ అర్ధంతరంగా మూతపడడంతో, కొన్నేళ్ళ శ్రమ ఫలితమైన స్పెషల్ ఎఫెక్ట్లు, గ్రాఫిక్స్ తాళాలు పడిన ఆ సంస్థ లోపలే కంప్యూటర్లలో ఉండిపోయాయి. దాంతో, శ్యామ్‌ప్రసాద్ రెడ్డి చెన్నైలోని పెంటాఫోర్ గ్రాఫిక్స్ వారిని సంప్రదించారు. వాళ్ళు ఆఖరు కొద్ది నెలల్లో శరవేగంతో చేసిన గ్రాఫిక్సే సినిమాకు శరణ్యమయ్యాయి. ఇవాళ 'అంజి' చిత్రంలో అత్యధికభాగం కనిపించేవన్నీ ఆ గ్రాఫిక్సే! సినిమా చిత్రీకరణ సమయంలో అనుకున్న గ్రాఫిక్స్‌లో కొన్ని లేకుండానే సినిమా విడుదలైపోయింది. ఈచిత్రం విడుదల బాగా ఆలస్యమైనందువల్ల గ్రాఫిక్స్ గురించి జనం చెప్పుకొన్నా, ఆశించిన స్థాయిలో ఆడనేలేదు. దాంతో నిరాశపడ్డ శ్యామ్‌ప్రసాద్ రెడ్డి మళ్ళీ పట్టుదలగా, మరింత శ్రమతో 'అరుంధతి' ('09) చిత్రాన్ని ఏళ్ళ కొద్దీ తీశారు. 2009 జనవరి 16న జనం ముందుకొచ్చిన ఆ చిత్రంతో అపూర్వ విజయం సాధించి, తెలుగు సినీ పరిశ్రమలో కొత్త బాక్సాఫీస్ రికార్డు నెలకొల్పారు. 2008 చివరలోనే సెన్సార్ జరుపుకొన్న ఈ సినిమా ఆ ఏడాదికి రాష్ట్ర ప్రభుత్వమిచ్చే నంది అవార్డుల్లో సింహభాగాన్ని చేజిక్కించుకుంది. 'అరుంధతి'లో చూపిన అపూర్వమైన స్పెషల్ ఎఫెక్ట్సుకు గాను విజువల్ ఎఫెక్ట్స్ సూపర్‌వైజర్ – క్రియేటివ్ డైరెక్టర్ అయిన రాహుల్ నంబియార్‌కు సైతం నంది అవార్డు లభించింది.

పేటకో స్టూడియో- తగ్గిన గ్రాఫిక్స్ ఖర్చు

గ్రాఫిక్స్ రూపకల్పనకు మొదట్లో ఖర్చు కూడా చాలా ఎక్కువే అయ్యేది. కానీ, ఇప్పుడు హైదరాబాద్‌లోనే స్పెషల్ ఎఫెక్ట్స్, యానిమేషన్ల రూపకల్పనకు పేటకో స్టూడియో వెలిసింది. ఎక్కువ మంది నిపుణులు అందుబాటులోకి రావడంతో గ్రాఫిక్స్ చేయించడం చౌక అయింది. గ్రాఫిక్స్ విభాగం కింద ప్రధానంగా 'డిజిటల్ ఆప్టికల్స్', '3డి గ్రాఫిక్స్' అనే రెండు శాఖల్లో పని జరుగుతుంది. ర్యాంపింగ్‌లు, షూటింగ్‌లో ఉపయోగించిన తీగలను తెరపై తుది బొమ్మలో కనిపించకుండా చేయడం (వైర్ రిమూవల్స్) లాంటివన్నీ 'డిజిటల్ ఆప్టికల్స్' కిందకు వస్తాయి. ఇవి చేయడానికి సర్వసాధారణంగా దృశ్యం నిడివిని బట్టి, నిమిషానికి ఇంత అని వసూలు చేస్తారు. ఇక, కంప్యూటర్ గ్రాఫిక్స్, ఒక దృశ్యంలో నుంచి మరో దృశ్యంలోకి మారడం, ఒక ముఖం మరో ముఖంగా మారడం లాంటి మార్ఫింగ్‌లు అన్నీ '3డి గ్రాఫిక్స్' కిందకు వస్తాయి. ఇవి చేయడానికి సాధారణంగా సెకనుకు ఇంత అని వసూలు చేస్తారు. ఒకప్పుడు ఈ 3డి గ్రాఫిక్స్ చేయడానికి సెకనుకు రూ. 4 వేలు దాకా వసూలు చేసేవారు. గ్రాఫిక్స్ నిపుణుల సంఖ్య పెరగడంతో ఇప్పుడు తెలుగునాట సెకనుకు రూ. 1500 నుంచి 2 వేలకు చేసేవారు కూడా అందుబాటులో ఉన్నారు. నిర్మాతలు తమకు కావాల్సిన నాణ్యత, నిపుణుల అనుభవాన్ని బట్టి ధర చెల్లించాల్సి వస్తోంది. అలాగే, డిజిటల్ ఆప్టికల్స్, 3డి గ్రాఫిక్స్, డిజిటల్ ఇంటర్మీడియట్ (డి.ఐ)ల పని మొత్తాన్నీ గుత్త కింద తీసుకొని, కొంత సరసమైన ధరకే చేసిపెట్టే ధోరణి కూడా ఇటీవల పెరిగింది. ప్రసాద్ స్టూడియో వారు 'ఇ.ఎఫ్.ఎక్స్' అనీ, ఇంకొకరు 'ఎస్.ఎఫ్.ఎక్స్' అనీ రకరకాల పేర్లతో విభాగాలు పెట్టి, నిర్మాతలకు ఈ పనులు చేసి పెడుతున్నారు. ఇది ఇలా ఉండగా, ఇవాళ అనేక హాలీవుడ్ చిత్రాల విజువల్ ఎఫెక్టలను సైతం తామే చేస్తున్నట్లు భారత్‌లోని సంస్థలు చెప్పుకోవడం చూస్తున్నాం. అయితే, ఈ సంస్థల్లో చాలా భాగం చేసేదల్లా – సృజనాత్మకతతో సంబంధం లేకుండా చేయాల్సిన బండ పనులైన వైర్ల తొలగింపు, పాయింట్లను ట్రాకింగ్ చేయడం లాంటివే!

ఇంద్రజాలం మనకేమైనా కొత్తా?!

అయితే, ఇవాళ వింతగా చెప్పుకొంటున్న విజువల్ ఎఫెక్ట్లు మన దక్షిణ భారత సినిమాకు మరీ కొత్తవేమీ కావు. కంప్యూటర్ పరిజ్ఞానం లాంటి ఆధునిక సాంకేతికత ఏమీ లేని రోజుల్లో 'కీలుగుఱ్ఱం', 'పాతాళభైరవి', 'మాయాబజార్' లాంటి జానపద, పౌరాణిక చిత్రాల్లో కేవలం కెమేరా పనితనంతోనే తెరపై సంభ్రమాశ్చర్యాలు కలిగే దృశ్యాలను మన దర్శక, సాంకేతిక నిపుణులు ఆవిష్కరించారు. "ఒకప్పుడు ఆట్టే వసతులు లేని రోజుల్లో మిచెల్ కెమేరాతోనే ఛాయాగ్రాహకులు మార్కస్ బార్ట్లే, హెచ్.ఎస్. వేణు, రవికాంత్ నగాయిచ్‌లు తెరపై అద్భుతాలు చూపారు. ఆ తరం నుంచి సెకనుకు, ఫ్రేముకు వంతున సినిమా ఖర్చును పెంచిన గ్రాఫిక్స్ యుగం వరకు తెలుగు సినిమా వృద్ధి చెందింది" అని యువ దర్శకుడు సాయి బాలాజీ వ్యాఖ్యానించారు. ఇక్కడ ఓ గమ్మత్తయిన విశేషం గమనించాలి. గ్రాఫిక్స్‌ను విస్తృతంగా ఉపయోగించిన 'జురాసిక్ పార్క్' లాంటి చిత్రాలు ప్రపంచమంతటా సంచలనం రేపాయి. వివిధ భారతీయ భాషల్లోకి అనువాదం కూడా జరుపుకొని, బాక్సాఫీసు వద్ద ఘనవిజయం సాధించాయి. అయితే, ప్రపంచమంతటా వసూళ్ళ వర్షం కురిపించిన 'జురాసిక్ పార్క్'కు తెలుగు నేలపై ఆ స్థాయి విజయం దక్కలేదు. దీనికి ప్రధాన కారణమేమిటని లోతుగా విశ్లేషిస్తే, బి. విఠలాచార్య మార్కు మాయలు, మంత్రాలు, తెరపై అద్భుతాలు తెలుగు వారికి 1960ల నుంచే సుపరిచితం. సాంకేతికత ఇంతగా అభివృద్ధి చెందని ఆ రోజుల్లోనే డైనోసార్లు, విచిత్ర వన్యమృగాలు, రోబోలు వగైరాలను తెరపై చూడడం విఠలాచార్య మార్కు జానపదాలతో మనకు అలవాటైపోయింది. రిపీట్ రన్ చిత్రాల్లోనూ రికార్డు చరిత్ర ఉన్న ఎన్టీ రామారావు నటించిన ఆ తరహా జానపద చిత్రాలు, మాయలు మంత్రాల సినిమాలు పదే పదే రిలీజవుతూ వచ్చాయి. అందుకే, ఈ 'జురాసిక్ పార్క్'లు, 'హ్యారీపోటర్'లను చూసి మనవాళ్ళు అంతగా ఆశ్చర్యపోలేదు.

గ్రాఫిక్స్ గాథలుగానే స్క్రిప్టు రచన

ఏమైనా, 'అరుంధతి' చిత్ర స్పెషల్ ఎఫెక్ట్స్ సూపర్‌వైజర్ – క్రియేటివ్ డైరెక్టర్ రాహుల్ నంబియార్ మాటల్లో చెప్పాలంటే – "విజువల్ ఎఫెక్టలు సినిమా రూపకల్పనకు మూడో డైమన్షన్‌ను కల్పిస్తున్నాయి. కథలో అంతర్భాగంగా వాడుకుంటే, అవి సినిమాకు కచ్చితంగా కొత్త సొబగులు సమకూరుస్తాయి. అదనపు విలువను అందిస్తాయి." 'అరుంధతి'కి విజువల్ ఎఫెక్టల బాధ్యతలు నిర్వహించిన 'టికిల్ బగ్ క్రియేటివ్

అంధవిశ్వాసాలకు ఆసరా

తీరా సృజనాత్మకతకు అధునాతన పరిజ్ఞానం తోడైన ఈ రోజుల్లో – ఆ ఆధునిక సాంకేతికతను ఎక్కువగా అంధ విశ్వాసాల చిత్రీకరణకు ఆసరాగా వాడుకోవడం అచ్చమైన వైచిత్రి. ఆనాటి 'అమ్మోరు' మొదలు నిన్నటి 'అంజి', నేటి 'అరుంధతి' దాకా చాలా సినిమాల్లో అందుకు ఉదాహరణలు కనిపిస్తాయి. అమెరికాలో పెద్ద చదువులు చదువుకొచ్చిన ఆధునిక నిర్మాతలు సైతం చేతబడి, బాణామతి, దెయ్యాలు, భూతాల లాంటి మూఢ విశ్వాసాల కథలకో, మూఢ భక్తి కథలకో గ్రాఫిక్స్‌ను ఊతంగా మార్చుకోవడం మింగుడు పడని విషయం. ఇది ఇలా ఉండగా, ఈ వెండితెర గ్రాఫిక్స్ గాథలకు సగటు ప్రజానీకపు ఆదరణ అర్థం చేసుకోదగినదే కానీ, ఉన్నత పీఠంపై కూర్చొని, సమాజానికి దిశా నిర్దేశం చేసే కళాకృషిని ప్రోత్సహించాల్సిన అవార్డు నిర్ణేతలు కూడా వీటికే ఓటేయడం మరీ విచిత్రం. దీంతో, సాంకేతికంగా ముందుకు వెళుతున్నామని ఆనందించాలో, కథాపరంగా ఉపయోగిస్తున్న తీరు చూసి పురాతన యుగాలలోకి పునఃపయనం సాగిస్తున్నందుకు బాధపడాలో అర్థం కాదు.

స్టూడియో'కు ఆయనే మేనేజింగ్ డైరెక్టర్. కేరళలో పుట్టి, రాజస్థాన్‌లో పెరిగి, గుజరాత్‌లో చిత్రలేఖనం నేర్చి, ముంబయ్‌లో యానిమేషన్ కోర్సు చదివి, హైదరాబాద్‌లో స్థిరపడ్డ ఈ కుర్రాడు 'రాగూర్', 'సాంబ', 'ఛత్రపతి', 'స్టైల్', 'గోదావరి' మొదలైన 20 దాకా చిత్రాలకు గ్రాఫిక్స్ సమకూర్చారు. కథతో సంబంధం ఉన్నా, లేకపోయినా సరే నవ్యత కోసం గ్రాఫిక్స్ వాడడం తెలుగు సినిమాల్లో మొదట్లో ఎక్కువగా ఉండేది. పెద్ద తారల భారీ చిత్రాలలో బడ్జెట్‌కు కొదవ ఉండదు కాబట్టి, పాటల్లో కూడా విజువల్ ఎఫెక్ట్‌లు వాడేవారు. సాధ్యాసాధ్యాలు, గ్రాఫిక్స్ నిపుణుల సాధకబాధకాలు చూసుకోకుండా, షూటింగ్ అంతా అయిపోయాక, ఫలానా చోట ఫలానా ఎఫెక్ట్ కావాలని కోరేవారు. కానీ, పోను పోను పరిస్థితి మారింది. "ఇవాళ స్పెషల్ ఎఫెక్ట్‌లను దృష్టిలో పెట్టుకొని మరీ కథలు అల్లుకుంటున్నారు. 'మగధీర' అందుకు పెద్ద ఉదాహరణ" అని ఆ చిత్ర స్పెషల్ ఎఫెక్ట్స్‌కు గాను తాజాగా జాతీయ అవార్డుకు ఎంపికైన కమల్ కణ్ణన్ అన్నారు. ఆ సినిమాలోని ఉదయగఢ్ కోట, జన సభాంగణం లాంటి నిర్మాణాల్లో 15 - 20 శాతమే కళాదర్శకుడు నిర్మించారు. రామోజీ ఫిలిమ్ సిటీలో ఈ కొద్దిపాటి సెట్స్ వేశారు. మిగిలినదంతా కంప్యూటర్‌లో గ్రాఫిక్స్ నిపుణులు సృష్టించి, తెరపై కళ్ళ ముందు నిలిపినదే!

గ్రాఫిక్స్‌తో గమ్మత్తులు

సినిమా ప్రచారానికి, ప్రాచుర్యానికి కూడా గ్రాఫిక్స్ తోడ్పడుతున్నాయి. ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసిన దివంగత నేతలనూ, నటులనూ మళ్ళీ తెరపైకి తీసుకువచ్చి, సినిమాల్లో భాగం చేయడం ఈ దశాబ్దిలో పలు మార్లు జరిగింది. ఎప్పుడో మరణించిన వారిని ఇలా గ్రాఫిక్స్ వినియోగంతో తెరపై సజీవుల్ని చేయడం ప్రేక్షకుల్ని బాగా ఆకట్టుకుంది. 'భారతీయుడు' (1996) చిత్రంలో ప్రముఖ స్వాతంత్ర్య వీరుడు సుభాష్ చంద్రబోస్‌తో కలిసి పెద్ద కమలహాసన్ సైనిక వందనంలో పాల్గొనే దృశ్యం అప్పట్లో వార్తల్లో విశేషమైంది. ఇలాంటి గ్రాఫిక్స్ గమ్మత్తులు సదరు సినిమా గురించి జనం పదే పదే చెప్పుకొనడానికి తోడ్పడ్డాయి. ఆ తరువాత నేరు తెలుగు చిత్రం 'కలిసుందాం రా!' (2000)లో స్వర్గీయ ఎన్టీయార్‌ను ఇలానే సజీవంగా చూపారు. 'నచ్చావే పాలపిట్టా...' పాటలో పెద్ద ఎన్టీయార్‌తో కలిసి వెంకటేశ్, సిమ్రాన్‌లు సైతం స్టెప్పులు వేసే దృశ్యాన్ని గ్రాఫిక్స్ ద్వారా సాధ్యం చేశారు. ఎన్టీయార్‌కు ఉన్న ప్రాచుర్యం ఆ చిత్ర ప్రచారానికి బాగా ఉపకరించింది. ఆ తరువాత 'యమదొంగ' ('07)లో స్వర్గీయ పెద్ద ఎన్టీయార్‌తో స్టెప్పులు వేయించడమే కాక, ఏకంగా డైలాగులు కూడా చెప్పించారు. రంభ, ఊర్వశులతో సాగే 'యంగ్ యమా...' పాటలో తాత గారైన స్వర్గీయ పెద్ద ఎన్టీయార్‌తో కలిసి మనుమడు జూనియర్ ఎన్టీయార్ నర్తించడం, యమలోకం ఘట్టంలో పెద్ద ఎన్టీయార్ కనిపించి, డైలాగులు చెప్పడం నందమూరి వంశాభిమానులకు పండగే అయింది. చిత్ర విజయానికి తోడ్పడింది. గ్రాఫిక్స్‌తో సాధ్యమైన ఈ విశ్వామిత్ర సృష్టి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం చలవే!

గ్రాఫిక్స్ గట్టెక్కిస్తాయా?

అయితే, ఈ సాంకేతిక పరిణామాలు, మార్పులన్నీ దేహానికి చేసే అలంకరణల లాంటివే! దేహంలో ప్రాణం లేకుండా, పై పై పటాటోపాలు, అలంకరణలు ఎన్ని చేసినా వాటి వల్ల ప్రయోజనం శూన్యం. అప్పుడు, ఇప్పుడు, ఎప్పుడూ సినిమాకు కథే ప్రాణం. అది బాగుంటేనే జనం చూస్తారు. కథ బాగుండి, దానికి ఈ సాంకేతిక అలంకరణలు తోడైతే, సినిమాకు మరింత అందం వస్తుంది. అలా లేకుండా సాంకేతిక హంగామాతో ఏదో చేసేద్దామని అనుకొంటే, అది వట్టి శవాలంకరణే అవుతుంది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ, 'విజయా' వారు సెకండ్ ఇన్నింగ్స్‌లో తీసిన 'భైరవ ద్వీపం' ('94) ఆడినా, అదే బృందంతో వారే రూపొందించిన 'శ్రీకృష్ణార్జున విజయము' ('96) చిత్రం ఆడలేదంటే కారణం – కథలో జీవం లేకపోవడమే! అలాగే, గ్రాఫిక్సే సినిమాను ఆడిస్తాయనుకుంటే, 'అమ్మోరు', 'అరుంధతి' ఆడినట్లే, 'అంజి', 'శ్రీఆంజనేయం' కూడా విజయవంతమై ఉండాలి కదా!

కొన్ని దశాబ్దాల క్రితమే తెరపై వెలిగిన 'ఇండియన్ స్పీల్‌బర్గ్' అని ఈ రోజున మనం సగర్వంగా చెప్పుకుంటున్న విఠలాచార్య సైతం సరైన కథ, కథనం ఎంచుకోనప్పుడు, మాయలు, మంత్రాల ఫార్ములా సైతం బాక్సాఫీసు వద్ద బోల్తా కొట్టిన ఉదాహరణలు కొల్లలు. ఇక, గ్రాఫిక్స్ లేకుండా ఇంతవరకూ సినిమాలే తీయని దక్షిణ భారతదేశ నంబర్‌వన్ దర్శకుడు శంకర్ సైతం గ్రాఫిక్స్‌నే నమ్ముకొని, వాటి కోసమేనంటూ సినిమాలు తీయలేదు. పాటల్లో, ఫైట్లలో అవసరమైన మేరకు వాటిని వాడుతూ, వరుసగా విజయాలు సాధిస్తున్నారు. సైన్స్ ఫిక్షన్ కథ 'రోబో'లో ఆయన పెద్దయెత్తున గ్రాఫిక్స్ వాడారు.

మొత్తం మీద, ఏ సాంకేతిక విభాగం పని తీరైనా సరే, సినిమాలో ఒక భాగమైపోవాలే తప్ప, అదొక్కటే కొట్టొచ్చినట్లు విడిగా కనబడుతూ ఉండకూడదు. గ్రాఫిక్స్ అయినా అంతే! "విజువల్ ఎఫెక్ట్‌లు ఎంత బాగున్నా, కథలో, కథనంలో అవి పాలూ నీళ్ళలా కలగలిసిపోవాలి. అలా కాకుండా కథ కన్నా గ్రాఫిక్స్‌దే పైచేయి అయిపోతే, ఫలితం వేరుగా ఉంటుంది. విజువల్ ఎఫెక్ట్‌లు బాగున్నాయని పేరొచ్చినా, బాక్సాఫీస్ వద్ద సినిమా బోర్లా పడుతుంది" అని ఓ ప్రముఖ యువ దర్శకుడు వ్యాఖ్యానించారు. అతి ముఖ్యమైన ఈ విషయం గ్రహిస్తేనే, సినిమాకైనా, సినిమా రూపకర్తలకైనా మేలు!

★

కథ

పుట్టుమచ్చ



- కూచిభట్ల శ్రీనివాసశాస్త్రి

"యు ఆర్ సెలెక్టెడ్" జెడ్జెస్ నోటి నుంచి ఇంటర్వ్యూలో ఈ మాటలు తప్పకుండా వింటానని మోహన్ ముందుగా ఊహించాడు. రిటన్ టెస్ట్‌లో చాలా బాగా రాశాడు. ఓరల్ టెస్ట్‌లో తన చిన్నప్పటి నుంచి ఆసక్తితో అలవర్చుకున్న ఇంగ్లీష్ ఫ్లూయన్సీతో ఇంటర్వ్యూలో జెడ్జెస్ అడిగిన ప్రశ్నలన్నింటికి వివరంగా సమాధానాలు చెప్పి వాళ్ల చేత శభాష్ అనిపించుకున్నాడు. ఇంటర్వ్యూ నుంచి బయటకు రాగానే విజయవాడలో వున్న తన తల్లిదండ్రులకు ఫోన్ ద్వారా ఈ శుభవార్తను తెలియపరిచాడు. మోహన్ హైటెక్ సిటీ నుంచి సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ చేరుకున్నాడు. విజయవాడకు ఫస్ట్ క్లాస్ టికెట్ కొని వైజాగ్ ఎక్స్‌ప్రెస్ ఎక్కాడు. రైల్లో ప్రయాణం చేస్తున్నంతసేపూ అతని మనసు తనకు వచ్చిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఉద్యోగం గురించిన ఆలోచనలతో నిండిపోయింది. ప్రారంభంలో నలభై వేల వరకు నెలజీతం అందుకోబోతున్నాడు. చాలాకాలంగా తన మధ్యతరగతి తల్లిదండ్రులు తన మీద పెట్టుకున్న ఆశలు ఫలించబోతున్నాయి. వాళ్ల ఆర్థిక చిక్కులు తొలగిపోతాయి. తను ఈ ఉద్యోగంతో జీవితంలో స్థిరపడినట్టే. కాని వివాహ విషయంలో తొందర పడకూడ దనుకున్నాడు. ఇప్పుడతని మనసులో తన జాబ్ కెరియర్‌కి తొలి ప్రాధాన్యత, తన పెళ్లికి రెండవ ప్రాధాన్యత ఇచ్చాడు. ఈ ఆలోచనలతో రైల్లో అతని సమయం గడిచింది. రైలు విజయవాడ చేరింది.

మోహన్ కంటే ముందు ఆరుగురు ప్రయాణీకులు ఆ కంపార్ట్‌మెంట్ నుంచి దిగుతున్నారు. అతను వాళ్ల వెనకాల క్యూలో వుండి నెమ్మదిగా అడుగులు వేసుకుంటూ డోర్ దగ్గరకు కదుల్తున్నాడు. అప్పుడు ప్లాట్‌ఫాం మీద వున్న ఒక యువతి అతని దృష్టిని ఆకర్షించింది. ఆపాదమస్తకం గమనిస్తూ తాబేలు నడకతో ముందుకు కదుల్తున్నాడు. ఆమె గులాబీరంగు శరీరంతో ఆమె కట్టిన గులాబీరంగు చీర జతకట్టింది. ఆమె ముఖం సౌందర్యంతో పోటీపడలేక ఒక గులాబీ సిగ్గుతో ఆమె తల వెనక దాగింది. ఆ క్షణంలో ఆ యువతి దివి నుండి భువికి దిగి వచ్చిన అతిలోక సుందరిగా అతని కళ్లకు కనిపించింది. కంపార్ట్‌మెంట్ నుంచి దిగడానికి అతని వంతు రాగానే ఆ సుందరి నుంచి దృష్టి మరల్చకుండానే ప్లాట్‌ఫాం మీదకు దిగాడు. అప్పుడామె ఒక పెద్దాయనతో మాట్లాడుతూ ఎడమచేతి మణికట్టుమీద పడిన చీరను పక్కకు తీసి రిస్ట్‌వాచ్‌లో టైం చూసుకుంది. ఆ క్షణంలో మోహన్ ఆమె మణికట్టుకు కొంచెం పైన వున్న ఒక పెద్ద పుట్టుమచ్చని చూశాడు. ఇప్పుడా అపరిచితురాలు అతని మనసులోని ప్రయారిటీలను తారుమారు చేసింది. ఆమె ఎవరో, ఎక్కడ వుంటుందో తెలియక పోయినా వివాహం చేసుకుంటే ఆమెనే చేసుకోవాలి లేదా జీవితంలో బ్రహ్మచారిగా వుండిపోవాలనే ధృఢ నిశ్చయాన్ని ముందు వెనక ఆలోచించకుండా చేసుకున్నాడు. ఆమె గురించిన ఆలోచనలు ఆ సమయంలో అతని ఉద్యోగం గురించిన ఆలోచనలను పక్కకి నెట్టివేశాయి. అతను గవర్నర్ పేటలో తన ఇంటికి చేరుకోగానే మనసును అదుపులో పెట్టుకుని తల్లిదండ్రులకు ఉద్యోగ వివరాలన్నీ చెప్పి వాళ్లని సంతోష పెట్టాడు.

ఒక వారం రోజుల తరువాత మోహన్‌కు విజయవాడలోనే ఉద్యోగంలో చేరడానికి ఆర్డర్స్ వచ్చాయి. ఉన్న వూళ్లోనే ఉద్యోగం రావడం అందరినీ సంతోష పరిచింది. ఒక నెల తరువాత అతని తల్లి సరస్వతి మా అన్నయ్య తన కూతురు శ్రీవల్లిని మన అబ్బాయికిచ్చి పెళ్లి చేద్దామనుకుంటున్నట్లు ఉత్తరం రాశాడు అంది భర్త సూర్యనారాయణతో.

ఆయన "వాడి ఉద్దేశ్యం కూడా తెల్సుకుందాం" అన్నాడు. శ్రీవల్లి పెళ్లి ప్రస్తావన వచ్చినపుడు ఆమెను పెళ్లి చేసుకోవడం ఇష్టంలేదని మోహన్ ఖచ్చితంగా చెప్పాడు. సూర్యనారాయణ చూసిన కొన్ని సంబంధాలు కూడా మోహన్‌కి నచ్చలేదు.

కాలం గడుస్తోంది. ఒక రోజున సరస్వతి "ఎన్ని మంచి సంబంధాలు వచ్చినా నువ్వు ఏ అమ్మాయినీ ఇష్టపడటం లేదు. నువ్వు కాదన్న వాళ్లలో ఆస్తి, అందం వున్నవారు, బాగా చదువుకున్న వాళ్లు, పెద్ద ఉద్యోగాల్లో ఉన్న వాళ్లు కూడా వున్నారు. నీకసలు ఎలాంటి అమ్మాయి అంటే ఇష్టం?" అని కొడుకుని నిలదీసి అడిగింది. విజయవాడ ప్లాట్‌ఫాం మీద యాదృచ్ఛికంగా కొన్ని క్షణాలు కనపడి తన మనసును ఆక్రమించిన ఆ అమ్మాయి వివరాలు తనకే తెలీనప్పుడు ఆ అమ్మాయినే పెళ్లి చేసుకుంటానని ఎలా చెప్పగలడు? అందుచేత మౌనం వహించాడు.

మరికొన్ని రోజులు గడిచాయి. మోహన్ తండ్రి అతనితో "రేపు రామశాస్త్రి మనింటికి వచ్చి కొన్ని మంచి సంబంధాలు చెబుతానన్నాడు. వాటిలో ఒక దానికి నువ్వు ఇష్టపడితే నేను, మీ అమ్మ చాలా సంతోషిస్తాం" అన్నాడు.

ఆ మాటలు విని సరస్వతి కొడుకుతో "చూశావా, మీ నాన్న కూడా అదే మాట అన్నారు. ఏ వయసులో జరగాల్సిన ముద్దు, ముచ్చట ఆ వయసులో జరిగితేనే అందం, ఆనందం. పెద్దవాళ్ల మవుతున్నామ! సంతోషం, తృప్తి కోసమైనా నువ్వు ఏదైనా ఒక సంబంధానికి ఒప్పుకోవాలి" అంది.

ఆ రాత్రి మోహన్ మనసులో, తన పెళ్లి గురించి తల్లిదండ్రుల ఉద్దేశ్యానికి తన నిశ్చయానికి మధ్య వున్న ఘర్షణ అతనిని కలవరపెట్టింది.

మర్నాడు ఉదయం టిఫిన్, కాఫీలు పూర్తి అయిన తరువాత రామశాస్త్రి వచ్చాడు. అమ్మాయిల ఫోటోలు ఒక అరడజను సూర్యనారాయణ దంపతులకు చూపిస్తూ వాళ్ల వివరాలన్నీ శాస్త్రి

అతని ప్రవర్తన ఆమెకి వింతగా తోచింది. "మణికట్టుపైన చేతి మీద పుట్టుమచ్చ ఏది?" అని అతను అడిగాడు. ఆమె అతని తికమక పరిస్థితిని అర్థం చేసుకుని నవ్వుతూ "మీరు రైల్వే స్టేషన్‌లో చూసింది నన్ను కాదు. నా కవల సోదరి శశిని. మా ఇద్దరి మధ్య తేడాను ఆమె ఎడం చేతి మణికట్టుపైన వున్న ఆ పుట్టుమచ్చ ఆధారంగానే ఎవరైనా కనిపెట్టగలరు. ఆ పుట్టుమచ్చని చూడనప్పుడు మా తల్లిదండ్రులే మా ఇద్దరినీ గుర్తుపట్టడంలో అప్పుడప్పుడు పొరపాటు పడుతూ వుంటారు. రామశాస్త్రి మీకు చూపించిన ఫొటోలలో వున్న నన్ను చూసి ఆమె అని పొరపడ్డారు" అంది.

చెప్పాడు. సూర్యనారాయణ ఒక ఫొటో వెనుక సీరియల్ నెంబర్స్ వేసి గుర్తు కోసం ఆ నంబర్స్‌తో వాళ్ల వివరాలు ఒక కాగితం మీద రాసుకున్నాడు. మోహన్ ఆ వివరాలను పట్టించుకోకుండా పరధ్యాసగా, వాటి మీద ఆసక్తి లేకుండా వున్నాడు.

సూర్యనారాయణ ఆ ఆరు ఫొటోలను కొడుకు చేతిలో పెట్టి "వీటిని చూసి నీకు ఏ అమ్మాయి నచ్చిందో స్థిమితంగా ఆలోచించుకుని చెప్పు" అన్నాడు. ఆ ఫొటోలలో వున్న ఏ అమ్మాయి కూడా తనకు నచ్చలేదని తల్లిదండ్రులకు ఎలాగో నచ్చచెబుదామని ఆ ఫొటోలను కూడా చూడటానికి ఇష్టం లేక వాటిని తన షెల్ఫ్‌లో పెడుతూ వుండగా అవి అతని చేతిలో నుంచి జారి కింద పడినాయి. మళ్లీ వాటిని ఒక్కొక్కటి ఏరి తీస్తుండగా అతను ఆ ఫొటోల్లోని అమ్మాయిలను అనుకోకుండా చూడటం జరిగింది. ఆశ్చర్యం! ఒక ఫొటోలో వున్న అమ్మాయి తన మనసును ఆక్రమించి తన హృదయంలో స్థానాన్ని సంపాదించి తన గుండెలో నిండి వున్న ఆ అపరిచితురాలే. తన సౌందర్య దేవతే! తను ఆమె తన భార్య కాబోతున్నది. వాటే ప్లెజంట్ సర్‌ప్రైజ్ అతను సంతోషం పట్టలేక వెంటనే తల్లిదండ్రులకు ఆ అమ్మాయి ఫొటోను చూపించి ఆమెను ఇష్టపడుతున్నానని చెప్పాడు. ఫొటోలను చూసిన పది నిమిషాల్లోనే తమ కొడుకు ఒక అమ్మాయిని ఇష్టపడటం వాళ్లకి సంతోషాన్ని, ఆశ్చర్యాన్ని కలిగించింది.

తండ్రి మోహన్‌తో "ఆ అమ్మాయి పేరు రాశి. బి.ఎస్.సి. కంప్యూటర్స్ కోర్సుతో ప్యాసయి ఎం.సి.ఏ. చేస్తోంది. తండ్రి రామనాథం. ఆంధ్రాబ్యాంక్ మేనేజర్. తల్లి హౌస్‌వైఫ్. ఆ అమ్మాయి కవల సోదరి శశి అమెరికాలో మేనమామ దగ్గరవుండి మల్టీమీడియా కోర్సు చదువుతోంది. రాశి పెళ్లికి రెండు లక్షల కట్నం ఇచ్చి చేద్దామనుకుంటున్నారు. ఆమె పుట్టిన తేదీ, జన్మనక్షత్రం కూడా వున్నాయి. వాటిని ఒక జ్యోతిష్కునికి చూపించి ఆమె జాతకం, నీ జాతకానికి సరిపడిందో లేదో తెల్సుకుందాం" అన్నాడు ఉత్సాహంగా.

"డాడీ, ఒక్క విషయం ఖచ్చితంగా చెబుతున్నాను. నేను పెళ్లంటూ చేసుకుంటే రాశినే చేసుకుంటాను. లేదా బ్రహ్మచారిగానే వుండిపోతాను" అన్నాడు మోహన్.

"అబ్బాయి చెప్పిందే రైటు. జాతకాల గొడవ లేకుండా ఇన్నాళ్లకి వాడు ఇష్టపడ్డ అమ్మాయితో వాడి పెళ్లి జరిపించటమే మంచిది" అంది సరస్వతి భర్తతో. వెంటనే సూర్య నారాయణ రామశాస్త్రికి ఫోన్ చేసి అతనిని పిలిపించాడు. రామనాథానికి కూడా జాతకాల పట్టింపులు లేవని చెప్పి రామశాస్త్రి పెళ్లిచూపులకు ఏర్పాట్లు చేశాడు.

పెళ్లి చూపుల్లో తను ఆరాధించిన అమ్మాయిని చూసి ఆనందంతో ఉప్పొంగిపోయాడు. కాని తన ఎడంచేతిని చీరతో కప్పుకుని ఉండటం వలన ఆ చేతి మీద పుట్టుమచ్చని చూడలేకపోయాడు. పేరుకు తగినట్టు మోహన్‌ది అందమైన రూపం. రాశికి అతను నచ్చాడు.

మోహన్, రాశిల పెళ్ళి ఘనంగా జరిగింది. తర్వాత అతను ఆమెతో సంభాషణ ప్రారంభిస్తూ "నిన్ను మొదటిసారిగా విజయవాడ రైల్వేస్టేషన్‌లో ఫ్లాట్‌ఫాం మీద చూశాను. అప్పుడు నువ్వు ఒక పెద్దాయనతో మాట్లాడుతున్నావు. అన్నట్టు " అని ఏదో గుర్తుకు వచ్చినట్టు ఆమె ఎడం చేతిని తన చేతిలోకి తీసుకుని పరీక్షగా చూస్తున్నాడు.

అతని ప్రవర్తన ఆమెకి వింతగా తోచింది. "మణికట్టుపైన చేతి మీద పుట్టుమచ్చ ఏది?" అని అతను అడిగాడు. ఆమె అతని తికమక పరిస్థితిని అర్థం చేసుకుని నవ్వుతూ "మీరు రైల్వే స్టేషన్‌లో చూసింది నన్ను కాదు. నా కవల సోదరి శశిని. మా ఇద్దరి మధ్య తేడాను ఆమె ఎడం చేతి మణికట్టుపైన వున్న ఆ పుట్టుమచ్చ ఆధారంగానే ఎవరైనా కనిపెట్టగలరు. ఆ పుట్టుమచ్చని చూడనప్పుడు మా తల్లిదండ్రులే మా ఇద్దరినీ గుర్తుపట్టడంలో అప్పుడప్పుడు పొరపాటు పడుతూ వుంటారు. రామశాస్త్రి మీకు చూపించిన ఫొటోలలో వున్న నన్ను చూసి ఆమె అని పొరపడ్డారు" అంది.

మోహన్ ఆశ్చర్యంగా విని "అయితే శశి మన పెళ్లికి ఎందుకు రాలేదు?" అని అడిగాడు.

"ఆమె అమెరికాలో మల్టీమీడియా కోర్సులో ఎడ్మిషన్‌కు ప్రయత్నిస్తూ నా పెళ్లికి రాలేకపోయింది. మన పెళ్లి శుభాకాంక్షలు ఫోన్‌లో చెప్పింది. విజయవాడ రైల్వేస్టేషన్‌లో మీరు ఆమెను చూసినపుడు ఆమె మా మేనమామతో వైజాగ్ వెళ్తోంది. అక్కడ ఆయన ఇంట్లో నాలుగు రోజులు వుండి, తరువాత ఆయనతో కూడా ఫ్లయిట్‌లో అమెరికా వెళ్లింది. ఆయన ఉద్యోగం అమెరికాలో, కాని ఆయన కుటుంబం ప్రస్తుతం వైజాగ్‌లో వుంది" అని శశి వివరాలు చెప్పింది రాశి.

ఇప్పటివరకు తన మనసులో స్థానం ఆక్రమించిన శశి అతనికి అపరిచితురాలు. కాని పుట్టుమచ్చ మినహా అదే రూపంలో వున్న రాశి తనకు భార్య అయి పరిచితురాలయింది. ఇప్పుడతని మనసులో శశి స్థానాన్ని రాశి ఆక్రమించింది. అతను వర్తమానంలోని వాస్తవికతతో సంతోషంగా రాజీ పడ్డాడు.

★

శ్రామికులే అంతిమ విజేతలు

కొత్త పుస్తకాలు

మానవుడు -సంపద-సమాజం,
రచయిత : లియోహ్యూబర్‌మన్, అనువాదం : కొమ్మారెడ్డి కేశవరెడ్డి, లంకిరెడ్డి శివన్నారాయణ, ప్రథమ ముద్రణ : డిసెంబర్, 1997, ద్వితీయ ముద్రణ : జనవరి, 2010, వెల : రూ.80/-, ప్రతులకు-ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని కేంద్రాలు.



వెయ్యేళ్ల మానవ సమాజ పరిణామక్రమంలో శ్రామికులే అంతిమ విజేతలు. ప్రముఖ రచయిత లియో హ్యూబర్‌మన్ తాను రచించిన మూలగ్రంథం 'Man's Worldly Goods'లో ఈ విషయాన్నే సుస్పష్టం చేశారు. ఈయన వివిధ దేశాలకు చెందిన ప్రాచీనకాలపు రికార్డులను అధ్యయనం చేసి, రచించిన పరిశోధనాత్మక గ్రంథం ఇది. దీన్ని 'మానవుడు-సంపద-సమాజం' అన్న పేరుతో తెలుగులో అందరికీ అర్థమయ్యేలా అనువదించేందుకు కొమ్మారెడ్డి కేశవరెడ్డి, లంకిరెడ్డి శివన్నారాయణ చేసిన కృషి అభినందనీయం. ముందుమాటలో రచయిత పేర్కొన్నట్లు చరిత్రను ఆర్థిక సిద్ధాంతం ద్వారానూ ఆర్థిక సిద్ధాంతాన్ని చరిత్ర ద్వారాను వివరించడానికి ప్రయతించారు. ఆ రెండూ ఒకదానితో ఒకటి పెనవేసుకున్న విడదీయలేని బంధమని, దాన్ని అలా చూస్తేనే అర్థమవుతుందన్నారు. అలా చూడకపోతే అది శూన్యశాస్త్రం అవుతుందన్నారు. ఆయన ఈ పుస్తకం రచించడానికి తన భార్య చెప్పడానికి సాధ్యంకానన్ని విధాలుగా తోడ్పడ్డారని పేర్కొనడం సంతోషం కలిగించింది. మొత్తం పుస్తకాన్ని రెండు భాగాలుగా విభజించారు రచయిత. ఇందులో మొదటిది ఫ్యూడలిజం నుండి పెట్టుబడిదారీ విధానం.. రెండవది పెట్టుబడిదారీ విధానం నుండి.. మొదటి భాగంలో 13 అంశాలను వివరిస్తే, రెండో భాగంలో 9 అంశాలను వివరించారు. మొత్తం పుస్తకం 22 అంశాలతో సవివరంగా ఉంది. దీన్ని ఆసాంతం చదవడమంటే సమాజ చరిత్రను, ఆయా ఆర్థిక విధానాలను అర్థంచేసుకోవడమే.

ఆర్థిక విధాన సిద్ధాంతాలు ఎలా అభివృద్ధి చెందాయి? కొన్ని సిద్ధాంతాలు ఆయా చారిత్రక పరిస్థితులలోనే ఎందుకు పుట్టాయి? ఆనాటి సామాజిక జీవితంలో ఎందుకు పెనవేసుకుపోయాయి? అవి ఏవిధంగా అభివృద్ధి అయ్యాయి? ఏవిధంగా మార్పులకు లోనయ్యాయి? సామాజిక పరిస్థితులలో వచ్చిన మార్పుల కారణంగా అవి ఏవిధంగా తొలగిపోయాయి? లాంటి ప్రశ్నలకు చారిత్రకాధారాలతో కూడిన సహేతుకమైన జవాబులు ఈ పుస్తకంలో లభిస్తాయి. కొన్ని రాయితీలను సాధించుకొనేందుకు పాలకవర్గాలను ఆశ్రయించిన వర్తకులు క్రమంగా పాలనా వ్యవహారాలలో పట్టును సాధించి, ఆ తర్వాత కీలకమైన నిర్ణయాలు చేయించే, చేసే స్థితికి ఎలా ఎదిగారు? అనే ప్రశ్నకు శాస్త్రీయమైన జవాబు ఇందులో లభిస్తుంది. నీరు పల్లానికే ప్రవహించడం ప్రకృతి ధర్మం. తద్భిన్నంగా సంపద పైపైకి ఎలా ఎగబాకుతుందో వివరిస్తుందీ పుస్తకం. వెయ్యేళ్ల మానవ జీవితాలను, సమాజ గమనాన్నీ ఈ పుస్తకం ఆవిష్కరించింది. సమాజ పరిణామక్రమానికి తొలి నుండీ భూమి కేంద్ర బిందువుగానే ఉంది. నేటి సమకాలీన సమాజంలోనూ అది ఎంతటి ప్రభావం చూపుతుందో మనందరం చూస్తున్నాం కూడా. నాడు భూమిపై ఆధిపత్యం ఉన్నవారే రాజులుగా, చక్రవర్తులుగా చలామణి అయ్యారని రచయిత పేర్కొన్నారు. ఆర్థిక వ్యత్యాసాలు సమాజాన్ని ఏరీతిగా ప్రభావితం చేస్తాయో రచయిత చక్కగా వివరించారు. ఫ్యూడల్‌శక్తుల ప్రభావం క్రమంగా తగ్గిపోయిన తరువాత ఆ స్థానంలో పురోగామిశక్తులు ఎలా బలపడ్డాయో కూడా వివరించారు. రాచరిక వ్యవస్థ సమాజాభివృద్ధికి ఆటంకంగా మారినప్పుడు భూస్వామ్య, పెట్టుబడిదారీశక్తులు అభ్యుదయ పాత్రను పోషించిన వైనాన్ని రచయిత వర్గ దృష్టితో విశ్లేషించారు. 17వ శతాబ్దంలో పాత సమాజాన్ని కూలదోసి, కొత్త సమాజాన్ని తీసుకొచ్చిన విధానాన్ని వివరించారు. రాచరికాన్ని కూలదోసి, అధికారంలోకి వచ్చిన శక్తులు తమ పాలనను సుస్థిరం చేసుకోవటానికి కొత్త రూపాల్లో పాత వాటినే అమలు చేశారన్నారు. నాడు రాచరికాన్ని కూలదోయటానికి రైతాంగాన్నీ, శ్రామికశక్తులనూ మిత్రులుగా మలచుకున్న పెట్టుబడిదారులు నేడు కార్పొరేట్‌శక్తులుగా రూపాంతరం చెందడాన్ని ఈ సందర్భంగా మనం గమనించాలి. ఇదే సమయంలో శ్రామికశక్తులు దోపిడీ, పీడనలకు గురవడాన్ని ప్రశ్నిస్తూ, వారిని సమాజాభివృద్ధిలో భాగస్వాములను చేయాలని, వారికి వాటా ఇవ్వాలనే సిద్ధాంతం ఎలా వెలుగు చూసిందో ఈ పుస్తకంలో వివరించారు. సమాజంలోని అన్ని వర్గాలకూ తలో సిద్ధాంతం ఉందన్నారు. ఇప్పుడు అన్నిదేశాల్లో పెట్టుబడిదారీ విధానం పోటీతత్వంలో ఉందని, ప్రజలకు కావాల్సిన వస్తూత్పత్తికన్నా తమ వద్ద ఉన్న వస్తువులనే అమ్ముకొనే విధానం అమలులో ఉందన్నారు. అయితే చైనా తదితర దేశాల్లో ప్రజలకు కావాల్సిన ఉత్పత్తులను తక్కువ ధరకు అందిస్తూ శ్రామికవర్గ సంస్కృతికి పెద్దపీట వేయడాన్ని ఈ సందర్భంగా మనం గమనించాలి. అందుకే అక్కడ పెట్టుబడిదారీవర్గ సంక్షోభం లేదు. ఎక్కడైనా కార్మికవర్గ అవసరాలు తీర్చలేనప్పుడు సంఘర్షణ అనివార్యమవుతుందని రచయిత సుస్పష్టంగా పేర్కొన్నారు. ఈ సంఘర్షణలో శ్రామికవర్గమే అంతిమ విజేతని విస్పష్టం చేశారు.

-శాంతిశ్రీ

హృదయ సౌందర్యాన్ని చూపిన 'అందం'

జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అనేక ప్రశంసలు, బహుమతులు పొందిన 'మా భూమి, రంగుల కల, మట్టి మనుషులు' చిత్రాలకు సహ రచయిత. ఇటీవల విడుదలై విజయవంతంగా ప్రదర్శింపబడిన 'కొమరం భీం' చిత్రానికి రచయిత, సంభాషణలకర్త అయిన ఎస్.ఎం.ప్రాణ్‌రావు కలంలోంచి జాలువారిన గొప్ప నవల ఈ 'అందం'. ప్రేమామృతం 'అందం' అంటూ శ్రీపతి ముందుమాట రాశారు. శీల సంపద, ఏక పత్నీవ్రతుని (మోనోగామి) హృదయ సౌందర్యాన్ని గ్రోలే విశాల హృదయం, దాంపత్య జీవితంలోని మాధుర్యం, పుత్రోత్సాహం, పితృహృదయం, ఆస్తి పాస్తుల్ని జయించే నిరాడంబరత స్వేచ్ఛ, స్వచ్ఛత, కామమే తప్ప ప్రేమ తెలియని యౌవ్వనోద్రేకం, లైంగిక సంబంధాలు, మధ్య తరగతి మనస్థత్వాల విశ్లేషణ, ఆర్థిక సంబంధాలే సర్వంగా భావించే యువత మనస్తత్వం పేద వర్గాల్లోని మనసులు, మమతలు, మనుషులు ఇలా విభిన్న కోణాల్లో ఐదు పాత్రలతో వంద పేజీల్లో నూరేళ్ల బంధం విలువ రచయిత ప్రాణ్‌రావు చక్కగా చెప్పారు. సంపదకన్నా శీలం ముఖ్యం అనే సందేశంతో పాటు అందంతో పాటు గుణం కూడా ఉండాలి అనే నినాదాన్ని ఈ కథాంశం అందించింది. కోటీశ్వరుని కుమార్తె అయిన మానస అందగాడైన చంద్రకాంత్‌ను ప్రేమించి తండ్రి ప్రసాదరావు వద్దు అన్నా పెళ్లాడి పిల్లాణ్ణి కంటుంది. పై చదువులకు చంద్రకాంత్ లండన్ వెళ్లాడు. అక్కడ తన క్లాస్‌మేట్ అమలను ప్రేమించడం, పెళ్లికి ముందు సెక్స్‌ను ఒప్పుకోని అమల, ఆమెను చైతన్య పరిచే చంద్రమౌళి (ప్రసాదరావు స్నేహితుడు), అమల చంద్రకాంత్ ప్రేమను తిరస్కరించడంతో కథ మలుపు తిరుగుతుంది. మానస ప్రేమ, అందం ముందు అందగాడైన చంద్రకాంత్ కురూపిగా నిలబడతాడు. ఆగిపోయిన సరస్వతి పెళ్లి జరిపించి (చంద్రకాంత్ చెల్లెలు) అత్తింటికి దగ్గరై, హిమాలయాలంత ఉన్నతకి "మానస" వ్యక్తిత్వాన్ని నిలబెట్టిన రచయితకు జేజేలు చెప్పాలి. పెళ్లికి ముందు లైంగిక సంబంధాల్ని తిప్పి కొట్టిన 'అమల' పాత్రను ప్రాణ్‌రావు చక్కగా మలిచారు. క్షమయా ధరిత్రి అన్నట్లు చివరకు భర్తను (చంద్రకాంత్) మానస మన్నించడం, మార్పుకోరే జీవితాన్ని సూచించడం చక్కని ముగింపు. యాసిడ్ దాడులు, ప్రియురాళ్ల హత్యలు, రాక్షస ప్రేమలు ఎక్కువౌతున్న తరుణంలో ఓ చక్కటి సందేశాత్మక ప్రేమ కథాంశం ఇది.



- తంగిరాల చక్రవర్తి

టెక్ఏజ్

నెట్‌తో ఇష్టాలు నిద్రలేమి కష్టాలు

నిత్యజీవితంలోని కష్టాల్ని, కలతల్ని తాత్కాలికంగానైనా మైమరపించి, అలసిన శరీరానికి కాసింత స్వాంతన చేకూర్చేది నిద్ర. రాజైనా పేదైనా సమాదరణతో కరుణించేది నిద్ర. అటువంటి నిద్ర నేడు కరువవుతోంది. కంటి నిండా నిద్ర లేకపోవడం అనేక అనర్థాలకూ హేతువవుతోంది. ఆధునిక జీవనంలో చోటుచేసుకుంటున్న మార్పులు మానవ జీవితంలో అనేక సమస్యలకు కారణమవుతోంది. పెరిగిన ఉద్యోగావకాశాలతోపాటు ఒత్తిళ్ళు అధికమవుతున్నాయి. ఫలితంగా మానసిక అలజడులు జీవితంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. అంతర్జాలం అవతరణ ప్రపంచ ఎల్లలు చెరిపేసినా ఇళ్ళల్లో కాళరాత్రులనే మిగుల్చుతోంది.

ఇటీవలి కాలంలో నిద్రలేమితో బాధపడుతున్నవారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. దీనికి రాత్రిపూట ఉద్యోగాలు ఒక కారణమైతే, రాత్రిపూట ఎక్కువ సమయం ఇంటర్నెట్‌తో గడపడం మరో కారణం. రకరకాల వెబ్‌సైట్లు, సోషల్ నెట్‌వర్క్, గేమ్స్, బ్లాగులు, మిత్రులతో చాటింగ్‌లు... దీనికోసం కంప్యూటర్‌పై గంటలకొలది గడిపేయడం. ఈమధ్య మొబైల్స్‌లో కూడా ఇంటర్నెట్ అందుబాటులో వుండడంతో కంప్యూటర్ అందుబాటులో లేని సమయంలో మొబైల్‌లో నెట్ బ్రౌజ్ చేయడం- దీనికి వయసుతో సంబంధంలేదు. ఇంటర్నెట్ అందుబాటులో వుంటే చాలు. పగలంతా పనిచేసి, విశ్రాంతి తీసుకోవాల్సిన రాత్రి సమయాన్ని ఇంటర్నెట్‌లో 'రకరకాల' సైట్లు చూసుకుంటూ, బ్లాగులు రాసుకుంటూ, చాటింగ్‌లు చేస్తూ, గేమ్స్ ఆడుకుంటూ గడిపేస్తున్నారు. ఈ రకంగా రాత్రిపూట ఇంటర్నెట్‌తో గడిపేవారి సంఖ్య గణనీయంగా పెరుగుతోందని పలు సర్వేలు వెల్లడిస్తున్నాయి. అంతేకాకుండా ఈ మెలకువగా వున్న సమయంలో ఏదో ఒకటి తినడం, తాగడం ఓ ఫ్యాషన్. ఫాస్ట్ ఫుడ్లు, స్వీట్లు, కాఫీ, టీ, కూల్‌డ్రింకులు వంటి పానీయాలు తీసుకోవడం- ఇవి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. స్థూలకాయం పెరగడానికి కూడా కారణమవుతున్నాయి. భార్యాభర్తల మధ్య గొడవలకు సైతం దారితీస్తున్నాయి.

అంతేకాకుండా ఇలా మెలకువగా వుండడం వల్ల మెదడుకు సంబంధించిన వ్యాధులు వచ్చే అవకాశం ఎక్కువగా వుందని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రతి ఒక గంట నిద్ర తక్కువకు మనలో 14శాతం వ్యాకులత పెరుగుతుందట. దీనివలన భవిష్యత్తులో మానసిక అలజడి ఏర్పడుతుందని 'స్లీప్' పత్రిక తన పరిశోధనలో వెల్లడించింది. ఈ మధ్యకాలంలో యువతీ యువకులు నిద్ర లేమి వలన కలిగే సమస్యలతో ఎక్కువగా బాధపడుతున్నారని, దానికి ముఖ్యకారణం ఇదేనని నిపుణులు చెబుతున్నారు. పని ఒత్తిడి ఇతరత్రా కారణాల వల్ల భారతీయుల్లో 93శాతం మంది కంటి నిండా నిద్రపోవడంలేదని నిల్సన్ కంపెనీ నిర్వహించిన 'ఫిలిప్స్ స్లీప్' సర్వేలో వెల్లడైంది. సాధారణంగా మనిషికి 8గంటల నిద్ర అవసరం కాగా, కనీసం 5గంటలు కూడా నిద్రపోవడంలేదట. 5గంటల కంటే తక్కువ సేపు నిద్రపోయే వారిలో మానసిక అలజడులు ఎక్కువగా వుంటాయని, 17-30 ఏళ్ళ వయస్సు వారిలో ఈ మానసిక అలజడులు ఎక్కువగా వున్నాయి. దీనికి కారణం ఈ వయస్సు వారు రాత్రిపూట నిద్ర పోవలసిన సమయంలో ఇంటర్నెట్‌తో గడుపుతున్నారని డైలీ మెయిల్ పత్రిక తెలిపింది.

నిద్రలేమి వల్ల మొదటిదశలో ఇన్సోమేనియా (Insomnia), రెండో దశలో బైపోలార్ (Bipolar), మూడోదశలో డిప్రెషన్ (Depression), చివరికి ఆంగ్సైటీ (Anxiety) గానూ మారుతుందని, ఈ మానసిక అలజడుల వలన వచ్చే వ్యాధులను తగ్గించడం అతి కష్టమని వైద్యనిపుణులు పేర్కొంటున్నారు.

ఈ మధ్యకాలంలో 17-30 సంవత్సరాల మధ్య వయస్కులే కాకుండా, మధ్య వయస్సు వారు కూడా ఎక్కువసేపు కంప్యూటర్, కంప్యూటర్ అందుబాటులోలేని సమయాల్లో మొబైల్‌తో గడుపుతున్నారు. ఇంటర్నెట్‌లో ఫేస్‌బుక్, ట్విట్టర్, ఆర్కుట్‌లపై గాసిప్, గేమ్స్, అశ్లీల సాహిత్యం, వీడియోలు వంటి అనవసరమైన విషయాలమీద తమ అమూల్యమైన నిద్రా సమయాన్ని వృథా చేస్తూ రాత్రి 1-3 గంటల మధ్య పడుకుంటున్నారు. తిరిగి పొద్దున్నే 7గంటలకు లేస్తున్నారు. పడుకున్న వెంటనే నిద్ర పట్టదు. ఇంటర్నెట్‌లో అప్పటివరకూ చూసిన విషయాలు మెదడులోని 'స్లీప్ సెంటర్'ను డిస్టర్బ్ చేస్తుంది. ఆ విషయాలే మనసులో మెదులుతుంటాయి. దీనివలన వారికి నిద్రపట్టడానికి ఆలస్యమవడమే కాకుండా, గాఢనిద్రకు కూడా అవకాశం వుండదు. ఇలా అతి తక్కువ సమయం నిద్రించే వారిలో చికాకు పెరిగి, అది కోపంగా మారుతుంది. దీనిని కంట్రోల్ చేసుకునేందుకు చేసే ప్రయత్నం మానసిక ఒత్తిడికి దారితీస్తుంది. తద్వారా ఎన్నో సమస్యలు తలెత్తుతాయి. ఉద్యోగస్తులైతే ఈ సమస్య మరింత ఎక్కువగా వుంటుంది. సహచరులతో కోపతాపాలు, సరిగా పనిచేయలేకపోవడం వంటి సమస్యలు ఉత్పన్నమవుతాయి. ఇది తెలియక, తెలిసినా కూడా చాలామంది ప్రశాంతంగా నిద్రించాల్సిన రాత్రి సమయాన్ని ఇంటర్నెట్‌తో గడుపుతూ ఆరోగ్యాన్ని పాడుచేసుకుంటున్నారు. అంతేకాదు నిద్రలేమి వల్ల కలిగే చిరాకు, కోపం, అసహనం కుటుంబ సంబంధాలపై కూడా ప్రభావం చూపుతోంది.

వేళకాని వేళల్లో నిద్ర రాక, నిద్ర పోవడానికి అనవసరమైన మందులు వాడుతూ, ఆ మందుల వలన కలిగే సైడ్ ఎఫెక్ట్స్‌ను భరిస్తూ ఇంటర్నెట్‌కు బానిస కానక్కరలేదు. విజ్ఞానాన్ని మానవ జీవిత వికాసానికి, విజ్ఞానార్జనకు ఉపయోగించుకోవాలే తప్ప అది దుష్పరిణామాలకు దారితీయకూడదు.

- రాజు కె.ఎక్స్

ఏమా పదం?





జవాబు: 1.microwave, 2.hospital

ఎవరక్కడ?

హేయ్ బుడుగులూ! ఈ చుక్కల్లో చిక్కిన వారు నోరు తెరిచారంటే చాలు అలా అంటారు. ఇంతకీ వారెవరో కనిపెట్టండి చూద్దాం. ఆ... అదంత ఈజీకాదు. మేం చెప్పినట్టు రంగులద్దితేనే తెలుస్తుంది. ఒక చుక్క వున్న దగ్గర లేత బులుగు, రెండు చుక్కలున్న దగ్గర ఆకుపచ్చ, ప్లస్ దగ్గర నలుపు అద్దండి. అంతే!

కత్తిరించండి...అతికించండి...

నేస్తాలూ! ఇదో గాజు పులి. కాకపోతే కిందపడి ముక్కలైపోయింది. ఆ ముక్కలే ఇక్కడ కింద వున్నాయి. వాటిని మీరు కత్తిరించి సరిగ్గా పులి ఆకారంలో అతికించాలి. మరి రెడీనా!



చుక్కలో చిక్కినదెవరోచ్?

అది తెలియాలంటే 1 నుంచి 38 వరకు అంకెలు కలిపేస్తే సరి.

నిజమైన నీడ

ఇక్కడ ముగ్గురు పిల్లలున్నారా! వారి నీడ ఫొటోలు నాలుగు కింద వున్నాయి. అందులో ఏది నిజమైన నీడో చెప్పాలి.



సమాధానం: బి

చీమకు ఏదీ దారి!

నేస్తాలూ... కోతిగారు నడుపుతున్న కారు మీదకు ఒక చీమ చేరింది కదా. పాపం కోతి డ్రైవింగ్ చూసి ఒకటే చీమకు ఒకటే దడ. ఎప్పుడెప్పుడు కారు మీదనుంచి దిగిపోదామా! అని ఒకటే కంగారు. ఇంతకీ చీమగారు కారు కింద పడకుండా జాగ్రత్తగా కారు దిగిపోవాలంటే ఎలా? ఏ దారిలో వెళ్లాలి?



ఏడంటే ఏడు తేడాలు

ఏడు తేడాలు : 1. పిల్లవాడి నోరు, 2.కోటు జేబు, 3.ముసుగు మనిషి కాలు, 4. చెయ్యి 5. ముసుగు వ్యక్తి చొక్కా చంక దగ్గర, 6.చెయ్యి, 7.చెట్టుపైన ఎడమ చేతివైపు మొదటి కొమ్మ

చీమకు ఏదీ దారి!



ఎవరక్కడ?

మాటల కోట - 19

రూపకల్పన : వెంకట సుబ్బారావు కావూరి

1	2		■	3	■	4	5	6
7		■	8		9	■	10	
	■	11					■	
■	12	■		■		■	13	■
14			■	15	■	16		
■		■	17	■	18	■		■
19	■	20		21			■	22
23	24	■	25			■	26	
27			■		■	28		

అడ్డం

1. భూమి నాది అన్న భూమి పక్కున నవ్వు అన్న ప్రజాకవి (3)
4. ప్రవాహం , నాలుగు దశాబ్దాల క్రితం స్వతంత్రపార్టీ పత్రిక కూడా (3)
7. మన రాజకీయ నాయకులు దీన్ని ఎప్పుడో వదిలేశారని ప్రతీతి. ఇక్కడ ఇది అడ్డం తిరిగింది కాక, సిగ్గు లేకుండా తేలికయిపోయింది (2)
8. మహిళ (3)
10. నామం పెట్టు నామం పెట్టు కాలేజీకి .... పూర్ణం లేకుండా అదీ అటు నుంచి ఇటు ఒకటి చాలు (2)
11. స్నేహ ముఖ పత్రం తిప్పగానే కనపడే మాట (5)
14. చిన్న గుంతలు ఏకవచనం (3)
15. సిరి. శ్రీశ్రీలో ఒకటే (1)
16. చాలినంత లేకపోవటం, మిగిలిన (3)
20. ఈ శీర్షికే (5)
23. వాయువు (2)
25. భారతీయుడు సినిమాలో ముసలి కమలహాసన్ అవినీతి పరుల ప్రాణాలను తీస్తూ దీన్ని తొలగిస్తున్నానంటాడు. ఇక్కడ క్రమం తప్పింది మరి చూసుకోండి (3)
26. విప్లవం, వెలుగు ఎడమ నుంచి కుడికి (2)
27. అనుకోని సంఘటన వింటేనో, చూస్తేనో కలిగే మానసిక స్థితి (3)

నిలువు

1. రహస్యంగా సమాచారం సేకరించువారు, వార్తాహరులు (3)
2. నల్లటి బూడిద, మురికి (2)
3. తోటలో (3)
5. పైనుంచి మంచు, కింద నుంచి భూమి (2)
6. బిగ్గరగా కోరికను తెలిపే అరుపు (3)
8. వనంలో జన్మించినది (3)
9. గమ్మత్తు (3)
12. జీవితం (3)
13. ఎద్దడి, అనావృష్టి. వాడుక కాదు, పత్రికా భాష (3)
17. క్రీడలే వాడుకలో (3)
18. తెలుగు మహిళల ప్రధాన వస్త్రాలు చిందరవందరయ్యాయి (3)
19. తెలుగు యుగానికి ఆది (3)
24. రాముడి బాణానికి కింద నుంచి పైకి వాలిపోయిన వానర రాజు (2)
26. కింద నుంచి భ్రమ (2)

మాటలకోట - 18 జవాబు

1 త్రి	పు	2 ర	నే	3 ని	గో	4 పీ	చం	5 ద్
పు	■	థం	■	న్న	■	ల	■	మో
6 ర	7 వి	■	8 ఆ	■	9 ఓ	■	10 జ	ప్ర
■	11 ప	12 ని	■	13 క	■	14 అ	మ్మి	■
15 క్కా	■	16 వు	రి	■	17 మా	రు	■	18 యి
■	19 స	రు	■	20 పో	■	21 దు	22 క్కి	■
23 ళం	గో	■	24 కి	■	25 రి	■	26 న	27 ఆ
వ	■	28 త	■	29 త	■	30 కృ	■	మే
31 దే	వు	ల	ప	ల్లి	కృ	ష్ణ	శా	స్త్రి

మట్టికుండ - రాగిబిందె

అప్పుడెప్పుడో వరదలు వచ్చాయి. నీళ్లల్లో ఓ మట్టి కుండ, రాగి బిందె కొట్టుకురాసాగాయి. అయితే ఒకదానికొకటి తగలకుండా పక్క పక్కనే ప్రయాణిస్తున్నాయి.



నీతి: నీకంటే బలవంతులు నీకు దగ్గరగా వున్నప్పుడు కొంచెం జాగ్రత్తగా వుండాలి.

ఎముకల కళ





ఒకేచోట 40,000 నుంచి 70,000 వరకు ఎముకలు కనిపిస్తే...? అదేదో ప్రాచీన శ్మశానవాటిక అనుకుంటున్నారా? కానీ...మనం ఇప్పుడు చెప్పకోబోయేది ఒక చర్చి గురించి. ఇంతకీ ఈ వాతావరణం వున్న చర్చి ఎక్కడ వుందనుకుంటున్నారు? చెక్ రిపబ్లిక్‌లో. ఇక్కడ ఎటు చూసినా ఎముకలే...గోడలు, స్తంభాలు, పై కప్పు...ఎక్కడ చూసినా అవే. కాకపోతే అన్నీ అత్యంత కళాత్మకంగా అలంకరించి వుంటాయి. ఒకే పరిమాణంలో వున్న ఎముకలను, సైజుల వారీ ఎముకలను ఒక పద్ధతిలో దండల్లా అమర్చి వేళ్లాడదీశారు. లిల్లీ పూల మధ్యలో బంతి పువ్వును గుచ్చినట్టు ఎముకల మధ్యలో పుర్రెలను గుచ్చి తయారుచేసిన దండలు కూడా దర్శనమిస్తాయి. ఇంతకీ చర్చి ఎంత పురాతనమైందనుకుంటున్నారు! 1318 మధ్యలో ప్లేగు మూలంగా, యుద్ధాల మూలంగా చనిపోయిన వేలాది మందికి ఇక్కడ అంతిమ సంస్కారాలు చేశారు. అలా మిగిలిపోయిన ఎముకలతో చర్చిని నిర్మించారట. అయితే ఇటీవలి అలంకరణలు మాత్రం చెక్ కార్పెంటర్ రింట్ పనితనం మూలంగా అమరినవే. అందరు కళాకారులవలెనే ఈయన కూడా తన పేరును ఒకచోట చెక్కాడు. కుడిచేతి వైపు గోడ మీద మానవ ఎముకలతో చేసిన అతని సంతకం వుంటుంది.